



# అక్షరకలం

తెలుగు దినపత్రిక






సంపుటి : 17 సంచిక : 165 | 23-07-2025 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## తెలంగాణ టెట్ ఫలితాలు
# విడుదల

- టీజీ టెట్ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థుల ఉత్తీర్ణత
- జూన్ 18 నుంచి 30 వరకు జరిగిన పరీక్షలకు 1,37,429 మంది హాజరు
- మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడి

వార్త 2లో

## ధన్ ఖడ్ రాజీనామాకు
# రాష్ట్రపతి ఆమోదం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలు లోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హెూంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమా వేశాలు ప్రారంభం కాగా చైర్మన్ హెూదాలో జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు.



వార్త 2లో

## కెటిఆర్ గిఫ్ట్ ఎ స్మైల్
# .. కెసిఆర్ కిట్ల పంపిణి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



వార్త 2లో

# విచారణకు సమయం కోరిన రానా



హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

బెట్టింగ్ యాప్స్ కేసులో సెలబ్రిటీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి రేపు (జూలై 23న) విచారణకు రావాలని నటుడు రానా దగ్గుబాటికి ఇడి నోటీసులు ఇచ్చింది. అయితే విచారణకు రానా కాస్త సమయం కోరాడు. రేపు షూటింగ్ షెడ్యూల్ ఉన్నందున విచారణకు హాజరుకాలేనని రానా తెలిపాడు. విచారణకు వచ్చేందుకు తనకు సమయం ఇవ్వాలని రానా విజ్ఞప్తి చేశాడు.కాగా, బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇడి రానాతో పాటు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మిలను విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది.



# రామచందర్‌రావు మరోసారి తన నిజస్వరూపం బయటపెట్టుకున్నారు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు సాధ్యమే అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు మరోసారి తన నిజస్వరూపం బయటపెట్టుకు న్నారని అన్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. రామచందర్ రావు బిసిల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ లో చేర్చడం అసాధ్యం అంటున్నారని మండిపడ్డారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో రిజర్వేషన్లను పెంచారని తెలి యజేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిలు రాజీనా మా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపిలు రాజీనామా చేస్తే బిసి రిజర్వేషన్లన్లు ఎందుకు అమలు కావో చూస్తాం అని బిసి రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి అని కోరారు. బిసి వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
# పేదలకు చేరాలి

- ప్రభుత్వ లక్ష్యలు నెరవేరేలా కలెక్టర్లు కృషి చేయాలి
- పథకాల ఫలితాలు అందేలా క్షేత్రస్థాయి చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు మంత్రుల ఆదేశం

వివరాలు 2లో..





2

## నితీశ్ కుమార్‌ను తప్పించడానికే ధన్‌ఖడ్
# రాజీనామా: ఆర్జేడీ

- సొంత పార్టీ నేతను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని వ్యాఖ్య
- అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రణాళికతో ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందన్న ఆర్జేడీ
- ఆర్జేడీ ఆరోపణలను ఖండించిన బీహార్ ఎన్డీయే నాయకులు

బీహార్‌లో నితీశ్ కుమార్‌ను తప్పించి సొంత పార్టీ నేతను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని, అందుకే జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందని ఆర్జేడీ ఆరోపించింది.

# ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

అక్షరకలం ప్రతినిధి హైద్రాబాద్

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హెూంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమా వేశాలు ప్రారంభం కాగా చైర్మన్ హెూదాలో జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు. తొలిరోజు కార్యకలాపాలు ముగిసి సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత ధన్ ఖడ్ తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన రాజీ నామా లేఖను సమర్పించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతిని కో రారు. కాగా, ఉపరాష్ట్రపతితో పాటు పలు పదవులు నిర్వర్తించిన జగదీప్ ధన్ ఖడ్ దేశానికి ఎంతో సేవలందించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ఈ మేరకు ట్వీట్ చేశారు.

# తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

**టీజీ టెట్ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థుల ఉత్తీర్ణత**

**జూన్ 18 నుంచి 30 వరకు జరిగిన పరీక్షలకు 1,37,429 మంది హాజరు**

**మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడి**

అక్షరకలం ప్రతినిధి హైద్రాబాద్

తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన పరీక్షకు 1,37,429 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడించింది. టెట్ ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఆన్ లైన్ లో నేరుగా విడుదల చేశారు. పేపర్ 1,2 లకు ఏడు భాషల్లో పరీక్ష నిర్వహించారు. పేపర్ 1 పరీక్షకు 47,224 మంది హాజరైతే.. 29,043 మంది పాస్ అయ్యారు. పేపర్ 2లో మ్యాథ్స్ అండ్ సైన్స్ పేపర్ లో 48,998 మంది పరీక్ష రాస్తే 17,574 మంది క్వాలిఫై అయ్యారు. పేపర్ 2 లోని సోషల్ స్టడీస్ లో 41,207 మంది ఎగ్జామ్ రాస్తే 13,075 మంది ఉత్తీర్ణులయ్యారు. అధికారిక వెబ్‌సైట్ లో అభ్యర్థులు తమ ఫలితాలు చూసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# కెటిఆర్ గిఫ్ట్ ఎ స్మైల్ .. కెసిఆర్ కిట్ల పంపిణి

అక్షరకలం ప్రతినిధి హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న ఉక్రోశంతోనే రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయా ంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ కిట్లను ఇస్తానని ప్రకటించిన కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తల్లీబిడ్డలకు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా గత 20 నెలల నుంచి కేసీఆర్ కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే తన పుట్టిన రోజు సందర్భంగా 5 వేల మంది తల్లులకు సిరిసిల్లలో కేసీఆర్ కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. 2014 కు ముందు నేను రాను బిడ్డో సర్కారు దవఖానాకు అని జనాలు భయపడేవారన్న కేటీఆర్.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న చర్యలతో సర్కార్ దవాఖానాకే పోవాలని జనాలంతా అనుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చిన కేసీఆర్ కిట్లను గత 20 నెలల నుంచి రేవంత్ సర్కార్ ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్ మీద ఉన్న అంతులేని ద్వేషం, కోపమే ఇందుకు కారణమని విమర్శించారు.

## వైద్య విద్యార్థికి సాయం..

గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పేద ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం అందించేందుకు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ సెల్‌కు చెందిన సంతోశ్ రోకండ్ల ముందుకొచ్చి.. రూ.1,40,000 లు అందజేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదువుతున్న పేద ఎంబీబీఎస్ విద్యార్థి సింహాద్రి చదువు కోసం ఆర్థిక సాయం అందించాలని ఇటీవల కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేటీఆర్ పిలుపు మేరకు గిఫ్ట్ ఏ స్మైల్ స్ఫూర్తితో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూఎస్ సెల్‌కు చెందిన సంతోశ్ రోకండ్ల ముందుకొచ్చారు. ఇవాళ సంతోశ్ కుటుంబసభ్యులైన రోకండ్ల జ్యోతి ఇవాళ కేటీఆర్‌ను కలిసి, ఆయన చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థి సింహాద్రికి రూ.1,40,000లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంతోశ్‌ను కేటీఆర్ అభినందించారు.

# నితీశ్ కుమార్‌ను తప్పించడానికే ధన్‌ఖడ్ రాజీనామా: ఆర్జేడీ

**సొంత పార్టీ నేతను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని వ్యాఖ్య**

**అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రణాళికతో ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందన్న ఆర్జేడీ**

**ఆర్జేడీ ఆరోపణలను ఖండించిన బీహార్ ఎన్డీయే నాయకులు**

బీహార్‌లో నితీశ్ కుమార్‌ను తప్పించి సొంత పార్టీ నేతను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తోందని, అందుకే జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందని ఆర్జేడీ ఆరోపించింది. ఉపరాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ రాజీనామాపై విపక్షాలు భిన్నంగా స్పందిస్తున్నాయి. నితీశ్ కుమార్‌ను అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే మార్చడానికి వీలుగా ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించారని ఆర్జేడీ చీఫ్ విప్ అక్తారుల్ ఇస్లాం షాహిన్ అన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయం కావడంతో వారిలో నిరాశ పెరిగిపోయిందని అన్నారు. చాలా కాలం క్రితం ఒక సీనియర్ బీజేపీ నాయకుడు నితీశ్‌ను తప్పించేందుకు మద్దతు పలికారని గుర్తు చేశారు. కేంద్ర మాజీ మంత్రి అశ్విని కుమార్ చౌబే మరో అడుగు ముందుకేసి నితీశ్ కుమార్‌ను ఉపప్రధాని చేయాలని సూచించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ధన్‌ఖడ్ రాజీనామాలో బీజేపీ కుట్ర ఉందని తేలిందని వ్యాఖ్యానించారు. నితీశ్ కుమార్‌కు ఉప రాష్ట్రపతి వంటి అప్రధాన్య పోస్టు ఇచ్చి తప్పించాలని చూస్తోందని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను బీహార్ రాష్ట్ర మంత్రి శ్రవణ్ కుమార్ తోసిపుచ్చారు. నితీశ్ కుమార్ బీహార్‌ను వీడబోరని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిని విజయబాటలో నడిపించి బీహార్ ప్రజలకు సేవ చేస్తారని అన్నారు. నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేరాలి

**ప్రభుత్వ లక్ష్యలు నెరవేరేలా కలెక్టర్లు కృషి చేయాలి**

**పథకాల ఫలితాలు అందేలా క్షేత్రస్థాయి చర్యలు**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు మంత్రుల ఆదేశం**



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర





సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి తదితరులు మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని,క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణం సాంఘిక, బిసి, మైనారిటీ- సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు.



హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ పక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు- చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హు÷నై ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమ్మో÷నై దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యకార్యదర్శులు నదీమ్, ఎన్. శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పూర్తికాలం పదవిలో కొనసాగుతానని వెల్లడి

## అంతలోనే రాజీనామా చేయడంపై అనుమానాలు

న్యూఢిల్లీ

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి రాజీనామా చేయడంతో ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. పది రోజుల క్రితమే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధన్‌ఖర్ ప్రస్తుతం పూర్తికాలం ఉప రాష్ట్రపతి పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. జులై 10న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. 'నేను ఆగస్టు 2027లో సరైన సమయంలో దైవ నిర్ణయానికి లోబడి పదవీ విరమణ చేస్తాను' అని స్పష్టం చేశారు. ఆయన 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే, పది రోజుల క్రితం పూర్తి కాలం ఈ పదవిలో కొనసాగుతానని చెప్పిన ఆయన.. ఇప్పుడు అనూహ్యంగా రాజీనామా చేయడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు- గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు.ది.రైతు బిడ్డగా పేరుగాంచిన ధన్‌ఖఢ్ రైతు సమస్యల విషయంలో మోదీ ప్రభుత్వ తీరును పలుసార్లు తప్పుపట్టారు. అంతర్జాతీయంగా భారత్ వెలిగిపోతుంటే మరి దేశంలో రైతులు ఎందుకు సంక్షోభంలో ఉన్నారని ఆయన ఓ సందర్భంలో కేంద్రాన్ని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని కూడా మోదీ సర్కారును ఆయన బహిరంగంగానే నిలదీశారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన ధన్‌ఖఢ్ 1951 మే 18న రాజస్థాన్‌లోని జుంజ్‌జునూ జిల్లాలోని కిథానా గ్రామంలో జన్మించారు. గతంలో కాంగ్రెస్, జనతాదళ్‌లో ఉన్న ధన్‌ఖఢ్ 2003లో బీజేపీలో చేరారు. ఉపరాష్ట్రపతిగా ఆయన ప్రతిపక్ష పార్టీలతో తీవ్రంగా విభేదించారు. 2019 నుంచి 2022 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పనిచేసిన ధన్‌ఖఢ్ మమతా బెనర్జీ ప్రభుత్వంతో పూర్తి స్థాయిలో ఘర్షణ వాతావరణాన్ని ఎదుర్కొన్నారు. తరచూ ప్రభుత్వంతో విభేదాలతో వార్తల్లో నిలిచారు. ధన్‌ఖఢ్ వైఖరిని మమతాబెనర్జీ తీవ్రంగా ఆక్షేపించారు.

# జీవో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

## ఆదివాసీ గూడాల్లో ఆనందం

## తమ పోరాటం ఫలించందని సంబరం



ఆదిలాబాద్,

ఎక్కడో ఒకచోట పులి జాడలుకనిపిస్తేనే వణికిపోయిన గిరజనం ఇప్పుడు..కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ జోన్ ప్రకటనతో చలించిపోయింది. తాము ఉన్న ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆందోళన చెందారు. అందుకు జీవో 49కి వ్యతిరేకంగా ఉద్యమించారు. జిల్లా బంద్ చేపట్టారు. జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, ఇతర సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీశారు. మిగతా మండలాల్లో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివాసీ, గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నెన్నెలలో జీవో ప్రతులను దహనం చేశారు. కాసిపేట మండలంలో బంద్ నడిచింది. ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు నిర్వహించి దుకాణాలను మూసి వేయించారు. బస్టాండ్, బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గుడిహత్నూర్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు జివోను రద్దు చేసేలా చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న టైగర్ కన్జర్వేషన్ జోన్ విషయంలో సర్కారు వెనక్కి తగ్గింది. సుమారు 330 గ్రామాలను ప్రభావితం చేయనున్న ఈ పులుల సంరక్షణ కేంద్రంపై ఆదివాసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. టైగర్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకువచ్చిన జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జీవో 49 విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ నుంచి సేకరించిన తాజా నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లో లక్షా 49 వేల హెక్టార్లను – టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49ని ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో 330 ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమగ్ర వివరాలను సేకరించారు. వాస్తవ పరిస్థితులను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, జీవో 49 నిలుపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలపడంతో పాటు సన్మానించారు. సహకరించిన మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండాసురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కు.. ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు కృతజ్ఞతలు తెలిపారు.

# ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ చర్చ

## అనూహ్య రాజీనామాకు కారణాలపై ఆరా

## లోతైన కారణాలు ఉంటాయని జైరామ్ రమేశ్ అనుమానం

న్యూఢిల్లీ,

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరికి తోచిన విధంగా వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఇంత సడన్‌గా ఎందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నారని ఆరా తీస్తున్నారు. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. అది కారణం కాకపోవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ధన్‌ఖడ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి అధ్యక్షత వహించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతో సహా పలువురు దీనికి హాజరయ్యారు. చర్చ అనంతరం సాయంత్రం 4.30కు మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. అయితే, మరోసారి భేటీకి రిజిజు, నడ్డా రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధన్‌ఖఢ్ మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దీన్ని బట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. రిజిజు, నడ్డా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖఢ్ ప్రకటించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని మనం గౌరవించాలి. కానీ, అందుకు చాలా లోతైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోందని రమేశ్ రాసుకొచ్చారు. తన పదవీకాలంలో రైతుల సంక్షేమంపై ధన్‌ఖఢ్ నిర్భయంగా మాట్లాడేవారని రమేశ్ పేర్కొన్నారు. ప్రజాజీవితంలో న్యాయపరమైన జవాబుదారీతనం, సంయమనం గురించి గట్టిగా మాట్లాడారన్నారు. ఆయన నిబంధనలు, ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉన్నారన్నారు. సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన సంగతి తెలిసిందే. తొలి రోజు కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖఢ్ రాత్రి అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైదొలగాలని నిర్ణయించుకోవడం అనుమానాలను కలిగిస్తోంది. ధన్‌ఖఢ్ రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ- ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు. ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. అనారోగ్య కారణాలతో పదవి నుంచి దిగిపోతున్నట్లు- ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ.. ఆయన రాజీనామాపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య కారణాలతోనే పదవి నుంచి దిగిపోతున్నట్లు- చెప్పారని.. దాన్ని మనం గౌరవించాలని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఆయన రాజీనామా వెనుక ఏదో లోతైన కారణమే ఉందని అనుమానం వ్యక్తం చేశారు.



# శేషప్రశ్నగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం!

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే..అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా...అనుమానాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యనాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించమో లేదా..రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహర్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యనాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు- పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది. ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభ లో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదల య్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు- లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్య మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.





అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# బహుజనులపై బహురూపులు


'ఆర్డినెన్స్' అంటేనే తాత్కాలికం. రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు, కేంద్రంలో పార్లమెంట్‌లో సమావేశాలు జరుగుతున్న సమయంలో కాకుండా ఇతర సమయంలో ఏదైనా నిర్ణయం తీసుకొని దాన్ని అమలుచేయవలసి వచ్చినప్పుడు ఆర్డినెన్స్ రూపంలో ఒక బిల్లును తీసుకువస్తారు. ఆ తర్వాత ఆ బిల్లును పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేసుకుంటారు. లేకపోతే ఆ ఆర్డినెన్స్ అక్కడికే రద్దవుతుంది. ఆ ఆర్డినెన్స్ అమల్లోకి రావాలంటే రాష్ట్రంలో గవర్నర్, కేంద్రంలో రాష్ట్రపతి ఆమోద ముద్ర తప్పనిసరి. అత్యవసర సందర్భాల కోసం రాజ్యాంగం కల్పించిన ఇలాంటి ఓ తాత్కాలిక వెసులుబాటుతో అత్యంత కీలకమైన బీసీ రిజర్వేషన్లకు ముడిపెట్టింది రేవంత్ సర్కార్. ఆర్డినెన్స్ తీసుకువచ్చి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని చెప్తున్నది. ఇది మరోమారు బీసీలను మోసపుచ్చడమే.నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లోనే స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రెండు వేర్వేరు బిల్లులను ఆమోదించి, వాటి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపింది. అవింకా ఆయన దగ్గరే పెండింగ్‌లో ఉన్నాయి. మళ్లీ అదే తరహా బిల్లును ఆర్డినెన్స్ రూపంలో కాంగ్రెస్ తీసుకువస్తే అసలు గవర్నర్ ఆమోదిస్తారా అన్నది మొదటి ప్రశ్న.ప్రస్తుతం దేశంలోని రాజకీయ పరిస్థితులను గమనించినట్టయితే బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, కేంద్రానికి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న ఘటనలను మనం చూస్తూనే ఉన్నాం. తమిళనాడులో ఆర్‌ఎన్ రవి, పశ్చిమబెంగాల్‌లో ఆనంద్ బోస్, కేరళలో ఆరిఫ్ ఖాన్%ా% బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో అక్కడి ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చే బీసీ రిజర్వేషన్ బిల్లును గవర్నర్ ఆమోదిస్తారా?ఆమోదించరని తెలిసే కాంగ్రెస్ 'మేం బిల్లులను ఆమోదించి పంపాం, అంతా కేంద్రం చేతుల్లోనే ఉంది' అని చేతులు దులిపేసుకొనే ప్రకటనలు చేసింది. అయితే, హైకోర్టు మూడు నెలల్లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో మళ్లీ ఆర్డినెన్స్ అంటూ హంగామా చేస్తున్నది. తాత్కాలికమైన ఆర్డినెన్స్ ద్వారా సుప్రీం తీర్పునకు విరుద్ధంగా కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లను ఎలా పెంచుతుందో వారికే తెలియాలి. రిజర్వేషన్లపై ఇందిరా



సహానీ కేసులో సుప్రీం కోర్టు విధించిన 50 శాతం పరిమితి ఇక్కడ మరో అత్యంత కీలకమైన విషయం. ప్రస్తుతం తెలంగాణలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నా యి. బీసీలకు అటూఇటుగా 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. రిజర్వేషన్ గణాంకాలు కొంత సంక్లిష్టంగా ఉన్నా సుప్రీం కోర్టు విధించిన పరిమితికి లోబడే అమలవుతున్నాయి. అయితే, కాంగ్రెస్ చెప్తున్నట్టు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచితే రిజర్వేషన్లు 50 శాతం పరిధిని దాటిపోతాయి. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం.తెలంగాణ సాధించుకున్న తర్వాత ఇక్కడి బలహీన వర్గాలకు న్యాయం జరుగాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భావించారు. పంచాయతీ ఎలక్షన్లలో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని చర్చ చేసి చట్టం కూడా తీసుకువచ్చారు. ఆ చట్టం ప్రకారం 34 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని, మొత్తం రిజర్వేషన్ 61.19 శాతం ఇవ్వాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ, దీనిపై సంగారెడ్డి జిల్లాకు చెందిన స్వప్న రెడ్డి అనే సర్పంచ్, గోపాల్‌రెడ్డి అని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు (వీరిద్దరూ కాంగ్రెస్ నాయకులే) హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ 50 శాతం దాటవద్దని హైకోర్టు కొట్టేసింది. అయినా, బీసీల మీద ఉన్న కమిట్‌మెంట్‌తో కేసీఆర్ 'గతంలో ఉన్నదే మాకు ఇవ్వండి' అని సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు.ఇక కాంగ్రెస్ వాదించే మరో అంశం ఏమంటే%ా% రాజ్యాంగంలోని 9వ షెడ్యూలు. 'మేం చేసిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేరిస్తే చాలు. ఇక కోర్టు వాటిని ముట్టుకోదు. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఆ పని చేయాలి' అంటూ నెపాన్ని పక్కకు నెడుతున్నది. కానీ, ఏ చట్టమైనా, అది 9వ షెడ్యూల్‌లో ఉన్నా, రాజ్యాంగ విరుద్ధమైనదని భావిస్తే న్యాయ సమీక్షకు వెళ్లాల్సిందే. 9వ షెడ్యూల్‌లో ఉన్న చట్టాలను కూడా సమీక్షించే అధికారం తమకు ఉన్నదని సుప్రీం కోర్టు 2007లో 'ఐఆర్ కోయెలో వర్సెస్ తమిళనాడు' కేసులో స్పష్టం చేసింది. అంటే, కాంగ్రెస్ చేస్తున్న వాదన అంతా బూటకమే.గతంలో హైకోర్టు మొట్టికాయలు వేసిన కారణంగా రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర్‌రావు చైర్మన్‌గా బీసీ డెడికేటెడ్ కమిషన్ వేసింది. కానీ ఈ కమిషన్ బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై సర్వేను సమగ్రంగా నిర్వహించలేదు. దీనిపై సొంత పార్టీ నేతలు సైతం విమర్శలు గుప్పించారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులను సమగ్రంగా అధ్యయనం చేయించాలి.బీసీల్లోని ఏయే కులాలు విద్యాపరంగా, రాజకీయపరంగా వెనుకబడ్డాయో గుర్తించాలి. పూర్తి వివరాలతో సరైన నివేదిక రూపొందించాలి. ఆయా వర్గాలకు ఎంత మేర రిజర్వేషన్ ఇవ్వాలనేది స్పష్టం చేయాలి. ఇలా చేయడం వల్ల ఆయా కులాలు ఏ విధంగా లబ్ధి పొందుతాయో కోర్టు ముందుంచాలి. రాష్ట్రంలో బీసీ జనాభా సగం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ వారు అత్యంత అసాధారణ స్థితిలో వెనుకబడి ఉన్నారని, వారికి మేలు చేయాలంటే 50 శాతం రిజర్వేషన్ పరిమితిని దాటి రిజర్వేషన్లను కల్పించాలని కోరాలి. అందుకు అనుకూలమైన డాటాను సమర్పించాలి.పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీ రిజర్వేషన్లను పెంచుతామంటున్నది. తర్వాత మున్సిపల్ ఎన్నికలు వస్తాయి. అప్పుడు మున్సిపల్ చట్టాన్ని సవరించాలి. అంతేకాదు, కీలకమైన ఉద్యోగ నోటిఫికేషన్లలో రిజర్వేషన్లపై ఉండే దృష్టి ఎంతటిదో తెలియంది కాదు. కాబట్టి ఈ అంశంపై ఎవ్వరైనా కోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నది. ఈ పరిస్థితుల్లో సుప్రీం సూచించిన విధంగా అధ్యయనం చేయకుండా, నివేదికలు సమర్పించకుండా రిజర్వేషన్లను గంపగుత్తగా 42 శాతానికి పెంచుతామంటే అది ఫలితాన్నివ్వదు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ఏండ్ల తరబడి బీసీలను మోసం చేస్తూనే ఉన్నాయి. అటు రాహుల్ గాంధీ, ఇటు ప్రధాని మోదీ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలంటున్నారు. మరి ఎవరు అడ్డుకుంటున్నారో బీసీ సమాజం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. ఏదేమైనా ఈ రెండు జాతీయ పార్టీలు బీసీలకు వ్యతిరేకమని స్పష్టంగా తెలుస్తున్నది. కాబట్టి, బీసీలు మరో పోరాటానికి నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది.

# రిషబ్ పంత్ అంటే ఇంగ్లండ్ జట్టుకు కూడా భయం

ఇండియా, ఇంగ్లండ్ జట్ల మధ్య సిరీస్‌లో నాలుగో మ్యాచ్ జులై 23 నుంచి మాంచెస్టర్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎలా ఉంటుందనేది పెద్ద ప్రశ్నగా మారింది. గత మ్యాచ్‌లో వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ వేలికి గాయం కావడంతో అతను వికెట్ కీపింగ్ చేయలేకపోయాడు. ఇప్పుడు మాంచెస్టర్‌లో రిషబ్ పంత్ ఆటపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా ప్రదర్శన చాలా అద్భుతంగా ఉంది. అయితే టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్ జట్టు ఈ ముగ్గురితో కాదు.. మరో భారత ఆటగాడికి భయపడుతుందని అన్నారు. స్టార్ స్పోర్ట్స్‌తో సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. "పరిస్థితి ఎలా ఉన్నా రిషబ్ పంత్ తన శైలితో ఆడతాడు. అతనికి ఆ స్వేచ్ఛ ఇవ్వాలి. ఐదో స్థానంలో రిషబ్ పంత్ ప్రస్తుతం అతిపెద్ద ఆటగాడు. ప్రస్తుతం రిషబ్ పంత్



ఇంగ్లండ్ జట్టుకు కూడా భయం కలిగించే ఆటగాడు. మరోవైపు బ్యాటర్లు మంచి ప్రదర్శన చేయాలి. యశస్వి జైస్వాల్ తన ఫామ్‌ను సద్వినియోగం చేసుకోవాలి. గత మ్యాచ్‌లో ఎలా ఔటయ్యాడో ఆలోచించాలి?" అని సంజయ్ మంజ్రేకర్ అన్నారు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గురించి సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. "శుభ్‌మన్ గిల్ పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. లార్డ్స్‌లో గిల్ విఫలమైనప్పటికీ టీమిండియా బ్యాటింగ్ బాగానే ఉంది. టీమిండియా బ్యాటింగ్ పూర్తిగా శుభ్‌మన్ గిల్‌పై ఆధారపడకపోవడం మంచి విషయం." అని ఆయన అన్నారు.ఈ టెస్ట్ సిరీస్‌లో రిషబ్ పంత్ మంచి ఫామ్‌లో కనిపిస్తున్నాడు. ఇప్పటివరకు 6 ఇన్నింగ్స్‌లలో రిషబ్ పంత్ బ్యాట్ నుంచి 425 పరుగులు వచ్చాయి. లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ రిషబ్ పంత్ 74 పరుగులు చేశాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ త్వరగా ఔటయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ కీపింగ్ చేస్తున్నప్పుడు రిషబ్ పంత్ వేలికి గాయం అయింది. రెండో ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ వికెట్ కీలకమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా పేర్కొన్నాడు. రిషబ్ పంత్‌కు మ్యాచ్ గమనాన్ని ఎప్పుడైనా మార్చగల సామర్థ్యం ఉంది. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో రిషబ్ పంత్ బ్యాట్ నుంచి అద్భుతమైన సెంచరీ వచ్చింది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు రిషబ్ పంత్ పూర్తిగా ఫిట్‌గా ఉండాలని టీమిండియా, అభిమానులు కోరుకుంటున్నారు. ఈ కీలక మ్యాచ్‌లో రిషబ్ పంత్ ఆడటం చాలా అవసరం, ఎందుకంటే నాలుగో టెస్ట్ మ్యాచ్‌ను గెలిచి టీమిండియా సిరీస్‌ను 2-2తో సమం చేయాలని చూస్తోంది.



# మరో ఆసక్తికర పోరుకు టీమిండియా సిద్ధం

## మాంచెస్టర్ వేదికగా నేటినుండి నాలుగో టెస్ట్

## ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న భారత్

ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో 1-2తో వెనుకంజలో నిలిచిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం నుంచి మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్ట్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. 11 ఏళ్ల తర్వాత మాంచెస్టర్ వేదికగా టీమిండియా టెస్ట్ మ్యాచ్ ఆడుతుంది. ఈ సిరీస్ ఆశలు సజీవంగా




ఉండాలంటే ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించడం కీలకం. ఓడినా.. డ్రా అయినా సిరీస్ గెలిచే అవకాశాలను టీమిండియా కోల్పోతుంది. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ విజయం కోసం టీమిండియా గత 18 ఏళ్లుగా నిరీక్షిస్తోంది. 2007లో చివరిసారిగా భారత్.. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచింది. అయితే మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్‌కు మెరుగైన రికార్డ్స్ లేవు. ఈ మైదానంలో భారత్ ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు.



మొత్తం 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ ఐదు మ్యాచ్‌లు డ్రా చేసుకొని నాలుగింటిలో ఓడింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధిస్తే 89 ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. 1936లో మహరాజ కెప్టెన్సీలో భారత్ మాంచెస్టర్‌లో టీమిండియా తొలి మ్యాచ్ ఆడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కటి గెలవలేదు. నాలుగో టెస్ట్‌లోనూ టీమిండియా ఓటమిపాలైతే.. ఒకే వేదికగా 10 ప్లస్ మ్యాచ్‌లు ఆడి ఒక విజయం సాధించిన జట్టుగా అప్రతిష్టను మూటగట్టుకుంటుంది. ప్రస్తుతం భారత్ మాంచెస్టర్‌తో పాటు బార్బోడస్ వేదికగా తొమ్మిదేసి మ్యాచ్‌లు ఆడి ఒక్క



విజయం సాధించలేదు. మరే జట్టు కూడా ఇలాంటి ఫీట్ నమోదు చేయలేదు. ఈ జాబితాలో ప్రస్తుతం ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక భారత్‌తో సమంగా ఉన్నాయి. ఆస్ట్రేలియా.. కరాచీ వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి ఐదింటిలో ఓడి 4 డ్రా చేసుకుంది. బంగ్లాదేశ్ డాకా వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి ఏడింటిలో ఓడి 2 డ్రా చేసుకుంది. బార్బోడస్‌లో భారత్ 9 మ్యాచ్‌లు ఆడి ఏడింటిలో ఓడి 2 డ్రా చేసుకుంది. మాంచెస్టర్‌లో భారత్ 9 మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో ఓడటంతో పాటు ఐదింటిలో ఓటమి తప్పించుకుంది. శ్రీలంక లండన్ వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి మూడింటిలో ఓడి 6 డ్రా చేసుకుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## అఫ్రిది తన వంకర బుద్ధిని బయటపెట్టాడు


ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ రెండవ సీజన్ జూలై 18న ప్రారంభమైంది. ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ సిరీస్‌లో భారత్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జూలై 20న జరగాల్సింది. కానీ ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని దృష్టిలో ఉంచుకుని భారత ఆటగాళ్ళు ఈ మ్యాచ్ ఆడటానికి నిరాకరించారు. అంతేకాదు ఈ మ్యాచ్‌ను



బహిష్కరించాలని డిసైడ్ అయ్యారు. దీంతో యాజమాన్యం భారత జట్టు ముందు తలవంచాల్సి వచ్చింది. చివరికి మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ రద్దుకు ప్రధాన కారణాల్లో ఒకటి పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది. కొంతకాలం క్రితం అఫ్రిది సోషల్ మీడియాలో భారత్ పై విషం కక్కాడు. ఈ ఛాంపియన్ జట్టులో ఆఫ్రిది కూడా ఉన్నారు. అయితే ఈ మ్యాచ్ రద్దైన తర్వాత మరోసారి స్పందించారు ఆఫ్రిది. భారత్, పాకిస్తాన్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్ గురించి షాహిద్ విషం కక్కాడు. ఈ మ్యాచ్ రద్దుతో భారత జట్టులోని చాలా మంది ఆటగాళ్లు కూడా నిరాశ చెందారని, జట్టులోని ఒక ఆటగాడి కారణంగా వారు ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ఆరోపణలు చేశారు. విలేకరుల సమావేశంలో భారత జట్టు కూడా ఈ మ్యాచ్ ఆడలేకపోవడం పట్ల నిరాశ చెందిందని.. దీనికి భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కారణమంటూ ఆఫ్రిది వ్యాఖ్యలు చేశారు. ఈ లీగ్‌లో పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తాను పాల్గొనబోనని శిఖర్ జూలై 11న బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. షాహిద్ అఫ్రిది ధావన్‌ను కుళ్ళిన గుడ్డు అంటూ పిలిచాడు. అతను టీం ఇండియా ఆటగాళ్లను చెడగొట్టాడని కూడా ఆఫ్రిది ఆరోపించాడు. “క్రీడలు దేశాలను దగ్గర చేస్తాయి. మీరు క్రీడలలోకి రాజకీయాలను తీసుకువస్తే, మీరు ఎలా ముందుకు వెళతారు” అంటూ ప్రశ్నించారు. సంభాషణ లేకుండా ఏదీ సరైనది కాదని, విషయాలను సరిదిద్దడానికి ఇటువంటి మ్యాచ్‌లు నిర్వహిస్తాయని అన్నారు. కానీ ప్రతి అంశాన్ని పాడు చేసే విధంగా మాట్లాడకూడదు. ఇంతటితో ఆఫ్రిది



ఊరుకోలేదు.. అగ్నికి ఆజ్యం పోస్తూ ధావన్ తన దేశానికి ఇబ్బంది కలిగించే వ్యక్తి అంటూ సంచలన ఆరోపణలు చేశాడు. భారత జట్టు ఆడాల్సిన అవసరం లేకపోతే వారు ఇక్కడికి ఎందుకు వచ్చారు. వారు ఇంట్లోనే ఉండి ఉండాలి కదా అంటూ ప్రశ్నించారు. చివరగా అఫ్రిది మాట్లాడుతూ.. దాదాపు అందరు భారత ఆటగాళ్లు మ్యాచ్ కు ముందు శిక్షణ పొందారని అన్నారు. కేవలం ఒకే ఒక్క ఆటగాడి కారణంగానే వారు మ్యాచ్ నుంచి వైదొలిగారని నేను భావిస్తున్నాను. దీనిపై భారత జట్టు కూడా చాలా కోపంగా ఉంది. వారందరూ ఇక్కడ ఆడటానికి వచ్చారు. మీరు దేశానికి మంచి రాయబారిగా ఉండాలని.. ఇబ్బందికి కారణం కాకూడదని నేను మీకు చెప్తున్నాను అంటూ చెప్పుకొచ్చాడు ఆఫ్రిది.




## టీమిండియాకు గాయాల బెడద

ఇంగ్లాండ్ పర్యటనలో టీమిండియా ప్లేయర్లు గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే టెస్ట్ సిరీస్‌లో 2-1 తేడాతో వెనుకబడిన భారత్‌కు స్టార్ ప్లేయర్ల గాయాలపాలు కావడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. టెస్ట్‌ల్లో అరంగేట్రం కోసం చూస్తున్న అర్ష్‌దీప్ సింగ్ ప్రాక్టీస్ సెషన్‌లో బౌలింగ్ చేస్తుండగా.. చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. స్టార్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గాయపడినట్లు సమాచారం. ఆదివారం జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో లిగమెంట్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో అర్ధరాంతరంగా భారత్‌కు వస్తున్నట్లు చెబుతున్నారు.



ఈ సిరీస్‌లో రెండు టెస్టులు ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి.. బౌలింగ్‌లో మూడు వికెట్లు తీయగా, బ్యాటింగ్‌లో 45 పరుగులు చేశాడు. ముఖ్యంగా మూడో టెస్ట్‌లో మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో కీలక వికెట్లు తీయడంతోపాటు బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించాడు. ఈ నేపథ్యంలోనే అన్షుల్ కాంబోజ్‌కు బీసీసీఐ పిలుపునిచ్చింది. మరోవైపు రెండో టెస్ట్‌లో అదరగొట్టిన ఆకాశ్‌దీప్ సైతం గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో నాలుగో టెస్ట్‌లో అతడు ఆడేది అనుమానంగా మారింది. ఈ ముగ్గురి ప్లేయర్ల గాయాల గురించి బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పనిభారం కారణంగా జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతినివ్వాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో కీలక ఆటగాళ్ల గాయాలు తలనొప్పిగా మారాయి. ఇప్పటికే మూడో టెస్ట్‌లో గాయపడిన రిషభ్‌పంత్ ఇంకా పూర్తి కోలులేదని సమాచారం. నాలుగో టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా దిగుతాడని చెబుతున్నారు. కరుణ్ నాయర్ వరుసగా మూడు టెస్ట్‌ల్లో విఫలం కావడంతో సాయిసుదర్శన్ లేదా అభిమాన్యు ఈశ్వరన్‌ను తుది జట్టులో తీసుకోవాలని మాజీలు సూచిస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకపోవడంతో ఈ



సిరీస్ ప్రారంభానికి ముందు ఇంగ్లాండ్ ముందు భారత్ కనీసం నిలుస్తుందా..? అని అందరూ అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ అనుమానాలన్ని పటాపంచల్ చేస్తూ తొలి టెస్ట్‌లోనే టీమిండియా అదరగొట్టింది. గెలుపు అవకాశాలను సృష్టించుకుని.. నాలుగు రోజులు ఆధిపత్యం చెలాయించి చివరి రోజు అనూహ్యంగా ఓటమిపాలైంది. ఇక రెండో టెస్ట్‌లో ఇంగ్లాండ్‌కు చుక్కలు చూపిస్తూ.. భారీ తేడాతో విజయం సాధించింది.మూడోటెస్ట్‌లోనూ అద్భుతంగా పోరాడింది. గెలుపు అంచుల వరకు వచ్చి.. చివరకు 22 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో సిరీస్‌లో నిలవాలంటే నాలుగో టెస్ట్‌లో భారత్ కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ఇలాంటి తరుణంలో ఆటగాళ్లు గాయాలు కావడంతో తుది జట్టు ఎలా ఉంటుందని ఉత్కంఠ నెలకొంది. బ్యాటింగ్ వరకు పెద్దగా సమస్యలు లేకపోయినా.. బౌలింగ్‌లో ఎవరిని తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. మాంచెస్టర్ వేదికగా ఈ నెల 23వ తేదీ నుంచి నాలుగో టెస్ట్ మొదలుకానుంది.

## ఫిడే మహిళల వరల్డ్ కప్ సెమీఫైనల్లోకి కోనేరు హంపి

భారత చెస్ ప్లేయర్, ఇంటర్నేషన్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ సెమీఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచారు. క్వార్టర్ ఫైనల్లో 1.5-0.5 పాయింట్ల తేడాతో చైనా ప్లేయర్ యుక్సిన్ సాంగ్ పై తెలుగు తేజం కోనేరు హంపి విజయం సాధించి ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ సెమీఫైనల్లోకి దూసెకెళ్లారు. శనివారం జరిగిన తొలి గేమ్ లో గెలిచిన కోనేరు హంపి, నిన్న జరిగిన రెండో గేమ్ డ్రా చేసుకున్నారు. సెమీఫైనల్లో కోనేరు హంపి చైనా ప్లేయర్, టాప్ సీడ్ లీ టింజీతో తలపడతారు. మరోవైపు మరో క్వార్టర్ ఫైనల్లో 2-0తో జార్జియాకు చెందిన ననా జాగ్నిజెపై లీ టింజీ విజయం సాధించింది. గత ఏడాది ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌గా హంపి నిలిచారు. ఫిడే మహిళల వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌కు



చేరుకున్న తొలి భారతీయురాలిగా నిలిచిన కోనేరు హంపిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుగు తేజం కోనేరు హంపిని అభినందించారు. ఆమె సెమీఫైనల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. చెస్ వరల్డ్ కప్ విజేతగా అవతరించాలని, భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి తెలుగు వారితో పాటు దేశానికి గర్వకారణంగా నిలవాలని తెలుగు రాష్ట్రాల సీఎంలు ఆకాంక్షించారు. ఫిడే ఉమెన్స్ వరల్డ్ కప్ సెమీ ఫైనల్ కు చేరిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి నా ప్రత్యేక అభినందనలు. ఈ వరల్డ్ కప్ లో సెమీఫైనల్స్ చేరిన తొలి భారతీయ మహిళ కోనేరు హంపి కావడం తెలుగు ప్రజలకు గర్వకారణం. హంపి విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. ఇద్దరు భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్, ద్రోణవల్లి హారికల మధ్య క్వార్టర్ ఫైనల్స్ నేడు ట్రైబ్రేక్ లో తేలనుంది. వీరి మధ్య జరిగిన రెండు గేమ్స్ డ్రాగా ముగియడంతో ట్రై బ్రేక్ తో ఫలితం తేల్చనున్నారు. మరో భారత క్రీడాకారిణి వైశాలి టోర్నీ నుంచి ఇప్పటికే వైదొలిగింది. క్వార్టర్ ఫైనల్స్ లో వైశాలిపై 0.5 1.5 తేడాతో తాన్ జ్యోంగి విజయం సాధించింది. మహిళల క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాలంటే తొలి మూడు స్థానాల్లో నిలవాల్సి ఉంటుంది.

## బీసీసీఐ ప్రెసిడెంట్ రేసులో ఆ ఇద్దరు?

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి జులై 19తో 70ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ట వయోపరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడువుతారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ లో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం..వరకు బిన్నీ కొనసాగుతాడా లేదా ఉపాధ్యాక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి ఆయన తప్పుకుంటాడా అనే విషయంపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. అంతేకాదు జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే ఛాన్స్ కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెడతారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే..జాతీయ క్రీడా సమాఖ్యలకు అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది.బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి



నిబంధనల్లో కూడా ఎక్కడా వయోపరిమితులను విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో 5ఏళ్లు కొనసాగే అవకాశం ఉంటుంది. ఇదే విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో 3ఏళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చేంత వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నారట.

# క్వార్ట్జ్ కేసులో అక్రమాల పుట్ట

### మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్ హస్తం



**నెల్లూరు**

క్వార్ట్జ్ కుంభకోణం కేసులో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు ఉచ్చు బిగుస్తోంది. విచారణలో వైసీపీ ముఖ్య నేతల భాగోతాలు బయటకొస్తున్నాయి. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ భారీ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మాజీ మంత్రులు అనిల్ కుమార్, కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన బిరదవోలు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో క్వార్ట్జ్ కుంభకోణంలో కీలక వ్యవహారాలని శ్రీకాంత్‌రెడ్డి చెప్పినట్లు- సమాచారం. గూడూరు, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనిల్ కుమార్ బ్యాచ్ వేల కోట్ల రూపాయల్లో మామూళ్ల వసూళ్లుకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అనుమతులు లేకపోయిన టన్ను క్వార్ట్జ్‌కి రూ.7 వేల నుంచి రూ.10వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలా సంపాదించిన అక్రమ సొమ్ముతో మాజీ మంత్రి అనిల్ కుమార్ భాగస్వామ్యంతో పలుచోట్ల స్థిరాస్థి వ్యాపారాలు నిర్వహించాడు శ్రీకాంత్ రెడ్డి. క్వార్ట్జ్ అక్రమ సొమ్ముతో భారీగా భూములు కొనుగోలు చేసి వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు- అధికారులు గుర్తించారు. గూడూరు, చెన్నూరు రోడ్డులో వంద ఎకరాల భూమిలో గ్రీన్ మెడోస్ పేరుతో రియల్ వెంచర్ ఏర్పాటు చేశారు. అలాగే నాయుడుపేట హైవే వెంట 50 ఎకరాల్లో స్వర్ణముఖి స్మార్ట్ సిటీ- పేరుతో రియల్ వెంచర్‌కి తెరదీశారు. హైదరాబాద్‌లోని మణికొండ అల్కాపురి వద్ద హెవెన్లీ హోమ్స్ పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే తుర్కయాంజల్ వద్ద గ్రీన్ మెడోస్ హౌసింగ్ కనస్ట్రక్షన్స్ పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు- పోలీసుల విచారణలో తేలింది.

# పక్కాగా ఫసల్ బీమా యోజన అమలు

### పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించా

### ఢిల్లీలో టిడిపి కార్యాలయ నిర్మాణం కోసం కృషి

### టిడిపి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

**న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు తీరుపై పార్లమెంట్‌లో ప్రస్తావించానని టిడిపి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ప్రతి పంటకు బీమా ఉండాలని, పంట నష్టం జరగకుండా చూడాలని కోరామని అన్నారు. వైసీపీ రైతు ప్రభుత్వమని చెప్పింది.. కానీ పూర్తిగా రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. మంగళవారం ఢిల్లీలో కలిశెట్టి అప్పలనాయుడు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పంట బీమా క్లెయిమ్‌లో.. అత్యధికంగా 40 శాతం మంది రైతులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నారని వివరించారు. మొత్తం రూ. 6,604 కోట్ల పెండింగ్ బీమా క్లెయిమ్స్‌లో.. ఆంధ్రప్రదేశ్ రైతులకే రూ.2,565 కోట్లు పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. 2022 నుంచి 2024 మధ్య కాలంలో సుమారు 30 లక్షల మంది రైతులు బీమా కోసం ఎదురు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాయలసీమ ప్రాంతం తీవ్రంగా ప్రభావితం అయ్యిందని తెలిపారు. కర్నూల్ జిల్లాలో 4లక్షల మంది, అనంతపురంలో 3 లక్షలు, కడపలో 2 లక్షలు, సత్యసాయి జిల్లాలో 2 లక్షల మంది రైతులు పంట నష్ట బీమా పరిహారాన్ని పొందలేకపోయారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రబీ, ఖరీఫ్ పంటల సీజన్‌లో జగన్ ప్రభుత్వం రైతులని నిర్లక్ష్యం చేసిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. ఇకపోతే ఢిల్లీలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. దేశ రాజధానిలో టీడీపీ కార్యాలయం ఉండాలని పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సూచించారని అన్నారు. ఈ మేరకు కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాలా ఖట్టర్‌ను కలిశామని.. ఢిల్లీలో టీడీపీ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరామని చెప్పుకొచ్చారు. గతంలో టీడీపీ కార్యాలయం కోసం స్థల పరిశీలన జరిగిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గుర్తుచేశారు.

# జిల్లాలు, మండలాల పేర్ల మార్పు

### మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు

అమరావతి,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్లు మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీనికి సంబంధించి అధ్యాయనం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు- చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు మంత్రులతో ఉప సంఘాన్ని నియమించింది. మంత్రి వర్గ ఉప సంఘం కన్వీనర్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో వెల్లడించింది. పరిపాలన సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. ఇక, జిల్లా రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం సూచించింది. సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతం చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కోసం అంతరాలు లేని విధంగా ప్రాంతాలను నిర్దేశిరచాలని చెప్పుకొచ్చింది. అలాగే, జనాభా సంఖ్య, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సరిహద్దులు నిర్ణయించాలని తెలిపింది. సరిహద్దులు, పేర్లపై ప్రజలు, ప్రజానిధుల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలనూ పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొనింది.

# తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం

### తిరుమల కార్యాలయాలన్నింటికి ఒకే పరిపాలనా భవనం

### అలిపిరి వద్ద సదుపాయాల కోసం కమిటీ నియామకం

### ఒంటిమిట్ట రామాలయంలో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ

### టిటిడి పలుకీలక నిర్ణయాలు...వెల్లడించిన ఇవో,ఛైర్మన్







**తిరుమల,**

తిరుమలలో రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మించేందుకు.. దీనిపై సాధ్యసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించినట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇవో శ్యామలారావు తెలిపారు. తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా పరిపాలనా భవనం నిర్మించాలని నిర్ణయించామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి మంగళవారం సమావేశం అయింది. ఈ



సమావేశంలో టీటీడీ పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు ఛైర్మన్ బార్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -3 నిర్మాణంపై చర్చించామని... కమిటీ- నివేదిక మేరకు ఈ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సామాన్య భక్తులకు అదనంగా వసతి సదుపాయలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అలిపిరి వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ఓ కమిటీని నియమించనున్నట్లు ప్రకటించారు. శిలాతోరణం, చక్రతీర్థం అభివృద్ధి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణ అధ్యాయనానికి ఓ కమిటీ వేయనున్నట్లు- వివరించారు. శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసే విధంగా కో ఆర్డినేటర్ల నియామకానికి ఆమోదం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదించారు. కల్యాణకట్టల వద్ద పారిశుద్ధం పెంపునకు, తిరుమలలో పరిపాలన భవనాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. పాత భవనాలని తొలగించి వాటి స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని ఆమోదించారు. ఒంటిమిట్ట ఆలయంలో త్వరలోనే అన్నదానం ప్రారంభించనున్నారు. రూ. 4.7 కోట్లతో అన్నదానం కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 320 ఆలయాలకు మైక్ సెట్లు- ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 700 మంది వేద పారాయణదారుల నియామకానికి ఆమోదం తెలిపారు. ఇందుకోసం రూ.18కోట్ల నిధులు కేటాయించ నున్నారు. 600 మంది వేద పారాయణదారులకు నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఆమోదించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఏపీలోని పలు దేవాలయాల వద్ద భజన మండలాల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఒంటిమిట్ట రామాలయంలో ఆగస్టు నుంచి అక్కడ మూడు పూటలా భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. ఏఐ టెక్నాలజీ అమలుకు విధానపరంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని బీఆర్ నాయుడు చెప్పారు. దీన్ని అధిగమించేందుకు రెండు ప్రముఖ సంస్థలు కసరత్తు చేస్తున్నాయన్నారు. త్వరలోనే ఏఐ సాంకేతికత అమలు చేసి భక్తులకు త్వరిగతిన దర్శనం కల్పిస్తామని తెలిపారు. హిందూయేతర ఉద్యోగులపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని ఆయన చెప్పారు. అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని.. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తితిదే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీవారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు- నడకమార్గంలో వచ్చేవారికి మెరుగైన వసతులు కల్పిస్తాం. శిలాతోరణం, చక్రతీర్థం సమగ్రాభివృద్ధికి ఆర్కిటెక్చరల్ కన్సల్టెన్సీ నియామకంపై చర్చించాం. వసతి గదుల కోసం వేచి ఉండేవారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం చర్యలు చేపడతాం. తితిదే తరఫున ఆలయాల విస్తరణపై ఆలోచనలు చేస్తున్నాం. శ్రీవారి సేవకు సంబంధించి చాలా సంస్కరణలు తీసుకొస్తున్నాం. డిజిటల్, సోషల్ మీడియా ద్వారా భక్తులకు జరిగే మోసాలను నివారించే అంశంపై చర్చించాం. తితిదేలో 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయించామని తెలిపారు. తిరుమలలో భక్తుల వేచి ఉండేందుకు అనువైన నిర్మాణాలు ఎలా చేయాలనే దానిపై కన్సల్టెన్సీని నియామకం చేపడతాం అన్నారు. ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన ప్రాంతాల్లో మూడు కేటగిరీల్లో భజన మందిరాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు విడుదల చేస్తాం. కడపలో వేల సంవత్సరాల చరిత్ర గల శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని ఈవో తెలిపారు.






# వీరమల్లు మూవీ కోసం చాలా కష్టపడ్డాం

### మూవీని ప్రమోట్చేయడంనాకు తెలియదు

### ఎఫ్‌డిసి చైర్మన్‌గా ఎఎం రత్నం పేరు సిఫారసు

### మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ వెల్లడి

పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' మూవీ జులై 24న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈసందర్భంగా టీమ్ స్పెషల్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. పోడియం లేకుండా మాట్లాడటం కష్టంగా ఉందని నవ్వుతూ పవన్ తన స్పీచ్‌ను ప్రారంభించారు. నా జీవితంలో సినిమాపరంగా మీడియాతో మాట్లాడడం ఇదే తొలిసారి. సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. దీనికోసం ఇంత కష్టపడ్డాం అని చెప్పడం నాకు మొహమాటంగా ఉంటుంది. నేను ఇండస్ట్రీక్రి వచ్చిన కొత్తలో నా ఫొటోలు కూడా పేపర్లో వేయలేదు. దీంతో పబ్లిసిటీ లేకుండానే నా సినిమాలు రిలీజ్ అయ్యాయి. సినిమా గురించి నాకు ఏం మాట్లాడాలో తెలియదు. . సినిమాను తెరకెక్కించాలంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. మన చిత్ర పరిశ్రమని పాన్‌ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి రత్నం. ఈ సినిమా చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. నేను పాలిటిక్స్‌కు వెళ్లిపోయిన తర్వాత సినిమాకు –టైం ఇవ్వలేకపోయాను. అయినప్పటికీ నా బెస్ట్ ఇచ్చాను. గతంలో నేను నేర్చుకున్న మార్షల్‌ఆర్ట్స్ ఈ సినిమాకు ఎంతో పనికి వచ్చిందని పవన్ వివరించారు. ఈ సినిమాకు క్లైమాక్స్ ఆయువుపట్టు–. కోహినూర్ వజ్రం చుట్టూ కథ తిరుగుతుంది. క్రిష్ చాలా మంచి కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారు. ఆయనకు మా టీమ్ అందరి తరఫున కృతజ్ఞతలు. ఒక్కోసారి ఇండస్ట్రీ చాలా కఠినంగా ఉంటుంది. రత్నం ఎంతో ముందుచూపు ఉన్న నిర్మాత. ఆయన ఈ సినిమా కోసం ఎంతో నలిగిపోయారు. ఈ సినిమా పూర్తవుతుందా, లేదా? అని అనుకున్నప్పుడు దీనికి కీరవాణి ప్రాణం పోశారు. ఒక్కోసారి డబ్బులు, సక్సెస్ కోసం కాదు ఇండస్ట్రీ బాగుకోరే వ్యక్తుల వెంట నిలవడం ఎంతో ముఖ్యం. అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా ఈ మీటింగ్‌కు వచ్చాను. ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా రత్నం పేరును ప్రతిపాదించాను. నాకు సినిమా అన్నం పెట్టింది. సినిమా అంటే నాకు ప్రాణవాయువుతో సమానం అని పవన్ తెలిపారు. మన ప్రభుత్వం చిత్రపరిశ్రమను ఎంతో ఆదరిస్తోంది. అందుకే ఈ సినిమా ప్రచారంలో భాగం కావాలని వచ్చాను. చిరంజీవి కుమారుడైనా, తమ్ముడైనా ఎవరైనా టాలెంట్ లేకపోతే నిలబడలేరు. రేపు నా కుమారుడైనా అంతే. ఇక్కడ ప్రతిభే ముఖ్యం అని పవన్ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం తెల్లవారుజామున 2 గంటలకు లేచి కష్టపడేవాడిని. జ్యోతికృష్ణ ఎంతో సత్తా ఉన్న దర్శకుడు. ఈ సినిమా ఫలితం పూర్తిగా ప్రజల చేతిలో ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే నేను కొన్ని పనులు చేయలేను. సుస్వాగతం సినిమాలో బస్సు మీద ఎక్కి డ్యాన్స్ చేయమన్నారు.



# మండుటెండల్లో 53రోజులు క్లైమాక్స్ షూటింగ్

మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏఎం రత్నం నిర్మాణంలో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'హరిహర వీరమల్లు' చిత్రం జులై 24న విడుదల కానున్నది. ఐదేళ్లుగా షూటింగ్ జరుపుకుంది. ఇక సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో హీరోయిన్ నిధి అగర్వాల్ , నిర్మాత ఏఎం రత్నం వరుస ప్రమోషన్లు చేసారు. అయితే తనకెంతో ఇష్టమైన నిర్మాత ఏఎం రత్నం కోసం పవన్ కళ్యాణ్ తన పాత పంథాని పక్కన పెట్టుకుని చాన్నాళ్ల తర్వాత మీడియా ముందుకు రావడం విశేషం. ప్రెస్‌మీట్‌లో తన మనసులోని భావాలను పంచుకున్నారు. హరిహర వీరమల్లు సినిమాకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించిన ఆయన, ఈ ప్రాజెక్ట్ పట్ల తన కమిట్‌మెంట్, ఇండస్ట్రీపై తన ప్రేమను మరోసారి చాటారు. సినిమా బతకాలి' అన్న ఒక్క ఉద్దేశంతోనే ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు– చేశానని పవన్ స్పష్టం చేశారు. ప్రీ–రిలీజ్ తర్వాత ఈ అవకాశం దక్కుతుందో లేదో తెలియక, తన మనసులోని భావాలను పంచుకోవాలని అనిపించిందన్నారు. ఈ సినిమా ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో సాగిందని పవన్ తెలిపారు. కరోనా విజృంభించిన సమయంలో, షూటింగ్ స్తంభించడంతో పాటు– పలు సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయన్నారు. దర్శకుడు క్రిష్, రచయిత సాయిమాధవ్ బుర్రా తపన చూసి, రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ, సినిమా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. మండుటెండల్లో 57 రోజులు క్లైమామామాక్స్ షూట్ చేశాం. చాలా కాలం తర్వాత మళ్లీ మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేశా. ఈ సినిమా –ల్గ÷కె–మాక్స్ సీన్లు అందరికీ ప్రేరణ కలిగిస్తాయి అని పవన్ చెప్పుకొచ్చారు. ఈ సినిమా కోసం నిర్మాత ఎదుర్కొన్న కష్టాలను చూసి, తన వంతు బాధ్యతగా ఈ సినిమాను చేయాలని భావించానని పవన్ తెలిపారు. నిర్మాత కనుమరుగు కాకూడదు అనే ఉద్దేశంతో నాపై నాకున్న గౌరవంతో, ఇండస్ట్రీపై ప్రేమతో ఈ సినిమాను చేశా అన్నారు. మూవీకి కీరవాణిగారి సంగీతమే ప్రాణం పోసింది,' అంటూ పవన్ కృతజ్ఞతలు తెలిపారు. నన్ను చాలా మంది విమర్శిస్తున్నారు. కానీ నన్ను అన్నం పెట్టిన ఇండస్ట్రీని మర్చిపోలేను.



# లక్కీ భాస్కర్ అనుకున్న విజయంసాధించలేదు

### నిర్మాత నాగవంశీ వెల్లడి

విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటించిన 'కింగ్‌డమ్' సినిమా జూలై 31న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ప్రస్తుతం ప్రమోషన్లలో బిజీగా ఉన్న నిర్మాత నాగవంశీ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన గత చిత్రాల ఫ్లాప్‌ల గురించి ఓపెన్ అయ్యారు. నాగ వంశీ మాట్లాడుతూ.. ' 'లక్కీ భాస్కర్' సినిమాకు నేను ఊహించినంత వసూళ్లు రాలేదు. అలాగే 'గుంటూరు కారం'పై వచ్చిన ట్రోలింగ్ నాకు ఇంకా అర్థం కావడం లేదు. కానీ నేను తెలిసి చేసిన తప్పు 'రణరంగం'. శర్వానంద్ లవర్ బాయ్ ఇమేజ్ ఉన్న సమయంలో వయసున్న పాత్ర చేయించడం అంత మంచిదేం కాదు అని బాబాయ్ గారు హెచ్చరించారు. అయినా మేము కొత్తగా ప్రయత్నించాలనుకున్నాం. అది వర్కౌట్ కాలేదు. కానీ అది పూర్తిగా ఫెయిల్ అయింది. బహుశా ఆ పాత్రను రవితేజ వంటి వాళ్లు చేసిన, హిట్ అయ్యేదేమో. అలాగే 'ఆదికేశవ' సినిమా విషయంలో కూడా పెద్ద తప్పు చేశా. రిపేర్ చేయాలని ప్రయత్నించిన కుదర్లేదు. ఈ రెండు సినిమాలు నా కెరీర్‌లో చాలా ఖరీదైన తప్పులుగా మిగిలిపోయాయి' అని ఆయన గుర్తు చేసుకున్నారు. తన తప్పులను నిస్సందేహంగా అంగీకరించి, తద్వారా భవిష్యత్తులో మంచి నిర్ణయాలు తీసుకోవాలన్న ప్రయత్నం చేస్తున్న నాగవంశీ మాటలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు, సినీ వర్గాలు ఆయన నిజాయతీని మెచ్చుకుంటు–న్నారు.



# పెద్ది మూవీ కోసం రామ్ చరణ్ కసరత్తులు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ది' సినిమా కోసం అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. ఇందులో చరణ్ డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం తాను వర్క్‌వుట్స్ చేస్తున్నట్లు– తెలుపుతూ రామ్ చరణ్ ఓ ఫొటో షేర్ చేశారు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది.

జిమ్‌లో వర్క్‌వుట్స్ చేస్తోన్న ఫొటోను షేర్ చేసిన ఆయన ..'పెద్ది కోసం మారుతున్నాను ఇలా.. దృఢమైన సంకల్పం.. గొప్ప ఆనందం' అనే క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన న్యూలుక్ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ 'పెద్ది' గ్లింప్స్‌లోని కొన్ని సన్నివేశాలతోనే పాన్ ఇండియా స్థాయిలో సినిమాపై ప్రత్యేకమైన ఉత్సుకతని రేకెత్తించింది చిత్రబృందం. అందుకు దీటు–గానే బుచ్చిబాబు సినిమాని రూపొందిస్తున్నారు. తాజాగా చెర్రీ లుక్‌తో ఆ అంచనాలు మరింత పెరిగాయి.



# ప్రకాశం జిల్లాలో ఫ్లెక్సీల గొడవ

## హరిహరవీరమల్లుపై బాలినేని ఫ్లెక్సీల తొలగింపు

**ఒంగోలు,**

ప్రకాశం జిల్లా ఒంగోలులో మరోసారి ఫ్లెక్సీల రగడ రచ్చకెక్కింది. డిప్యూటీ– సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన తాజా సినిమా 'హరిహర వీరమల్లు' మూవీ ఫ్లెక్సీలను తొలగించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఫోటోలతో హరిహర వీరమల్లు ఫ్లెక్సీలు ఒంగోలులో ఏర్పాటు చేశారు. బాలినేని ఫోటోలతో ఏర్పాటు– చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించింది. ఫ్లెక్సీల తొలగింపును బాలినేని అనుచరులు తప్పుపట్టారు. మున్సిపల్ అధికారుల అనుమతి ఇవ్వటంతో వివాదం సద్దుమణిగింది. తిరిగి ఫ్లెక్సీలను బాలినేని అనుచరులు యధాస్థానంలో ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వైసీపీకి రాజీనామా చేసిన బాలినేని శ్రీనివాస రెడ్డి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో బాలినేనికి పవన్ పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. బాలినేని జనసేనలో చేరికని గత కొంతకాలంగా టీడీపీ, జనసేన క్యాడర్ వ్యతిరేస్తోంది. పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా జులై 24 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా తన ఫోటోలతో వీరమల్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలను తొలగించగా.. మున్సిపల్ అధికారుల అనుమతితో తిరిగి యధాస్థానంలో ఏర్పాటు– చేశారు.

# దళిత యువకుడు సుబ్రమణ్యం హత్య కేసు

## తదుపరి విచారణకు ఎస్సీఎస్టీ కోర్టు అనుమతి

**రాజమహేంద్రవరం,**

వైకాపా ప్రభుత్వ హయాంలో హత్యకు గురైన దళిత యువకుడు సుబ్రమణ్యం కేసులో కదలిక వచ్చింది. అప్పట్లో ఈ హత్య సంచలనం రేపింది. వైకాపా నేత అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యకు గురయ్యాడు. ఈ కేసులో తదుపరి విచారణకు రాజమహేంద్రవరంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి ఇచ్చింది. 90 రోజుల్లో సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2022 మే 19న కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగింది. డ్రైవర్‌ను హతమార్చిన వైకాపా నేత అనంతబాబు.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. హత్య తానే చేశానని అనంతబాబు అంగీకరించారని మీడియా సమావేశంలో అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు వెల్లడించారు. అనంతబాబును రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు పంపారు. తర్వాత మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారు. తమకు న్యాయం చేయాలని.. ఈ హత్య కేసుపై సీబీఐ విచారణ జరిపి, అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటు–ంబం కోరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక బాధిత కుటు–ంబానికి పరిహారం అందజేయడంతో పాటు– న్యాయ సలహాలకు ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల సుబ్బారావును నియమించారు.


# కురళ కాంగ్రెస్‌లో థరూర్ వివాదం

## ఆయనను దూరం పెట్టామన్న మురళీధరన్

## ఏ అధికారంతో ఈ ప్రకటన చేశారంటూ థశిథరూర్ ఎదురుదాడి

**తిరువనంతపురం**

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కు సొంత పార్టీ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఓ రకంగా ఆయనను దూరం పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వెళ్తున్న తిరువనంతపురం ఎంపీ శశథరూర్‌కు, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ– మాజీ అధ్యక్షుడు కె.మురళీధరన్ కు మధ్య మాటలు తూటాలు పేలుతున్నాయి. జాతీయభద్రత విషయంలో పార్టీలకు అతీతంగా స్పందించాలంటూ శశిథరూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మురళీధరన్ గత ఆదివారంనాడు ఘాటుగా స్పందించారు. అతన్ని పార్టీ కార్యకలాపాలకు దూరం పెడుతున్నామంటూ కాంగ్రెస్ కు చెందిన మరోనేత మురళీధరన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన క్రమంలో తాజాగా థరూర్ స్పందిస్తూ.. అలా చెప్పడానికి ఆయనకు పార్టీలో ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. మురళీధరన్ వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా.. థరూర్ స్పందిస్తూ.. ఇలాంటి వాదనలు చేయడానికి వారి వద్ద ఎలాంటి ఆధారం ఉందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చేస్తున్నవారికి పార్టీలో ఏ అధికారం లేదంటూ మురళీధరన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. పలువురు ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని, వాటిన్నింటికీ స్పందించాల్సిన అవసరం తనకు లేదన్నారు. వేరేవాళ్ల ప్రవర్తన గురించి తనను అడగొద్దని. తన గురించి మాత్రమే మాట్లాడతానని వ్యాఖ్యానించారు. పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని థరూర్ పలుమార్లు ఉద్ఘాటించారు. దీనిపై మురళీధరన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. శశిథరూర్ తన తీరు మార్చుకునే వరకు తిరువనంతపురంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించబోమన్నారు. మాతో కలిసి లేరు కాబట్టి.. ఆయన్ను బహిష్కరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. కేరళలోని యూడీఎఫ్ నేతల్లో సీఎం అభ్యర్థిగా శశిథరూర్ వైపే మొగ్గు ఉందంటూ ఓ సర్వేకు సంబంధించిన పోస్టుపైన మురళీధరన్ గతంలోనూ విరుచుకుపడ్డారు. కొచ్చిలో ఓ హైస్కూలు విద్యార్థి అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ సమాధానమిస్తూ, మన సాయుధ దళాలకు, మన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం సరైనదేనని తాను నమ్మడం వల్ల అనేక మంది తనను విమర్శించారని, అయితే తన వైఖరి సరైనదేనని నమ్మి దానిపై నిలబడ్డానని చెప్పారు. రాజకీయాలు అంటేనే పోటీ– అని, తనలాంటి వాళ్లు పార్టీని గౌరవిస్తారని, అయితే జాతీయ భద్రత విషయానికి వచ్చేసరికి మనం ఇతర పార్టీలతో కలిసి పనిచేయాల్సిన అవసరం వస్తుందని అన్నారు. అలాంటి సందర్భాల్లో ఒక్కోసారి పార్టీలు దానిని అవిధేయతగా భావిస్తుంటాయని, అదే పెద్ద సమస్య అని అన్నారు. జాతీయ భద్రతకు తాను ఎప్పుడూ తొలి ప్రాధాన్యతనిస్తానని, ఏ రాజకీయ పార్టీ అయినా దేశాన్ని మెరుగుపరచాలనే కోరుకుంటు–ందని చెప్పారు. సిద్ధాంతాల పరంగా పార్టీల మధ్య వైరుధ్యాలు ఉన్నా సురక్షితైన భారత్‌కు అవన్నీ కట్టుబడి ఉండాలన్నారు. జాతీయ ఐక్యతకు రాజకీయాలు అడ్డుకారాదని అన్నారు.



# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## చేసిన పనులపై ఎప్పటికప్పుడు వివరించాలి

## పెద్ద ఎత్తున కార్యక్రమాలపై







## వివరించేలా ప్రచారం

## సమాచారశాఖ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

**హైదరాబాద్,**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏడాదిన్నర కాలంలో ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ చేసిన మంచి పనులను సవివరంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు. నేడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో చెయ్యనివాటిని చేసినట్లుగా గోబెల్స్ ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టిందని, ప్రతిపక్షంలో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతోందని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసినదాన్ని కూడా పూర్తిగా చెప్పుకోలేకపోతున్నామని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నరలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతోచేసినప్పటికీ ఆశించిన రీతిలో ప్రజలకు వివరించలేకపోతున్నామని అన్నారు. ఇచ్చిన హామీలనే గాక ఇతర అంశాలలో ప్రజోపయోగపనులు చేపట్టామని , 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఇంత భారీ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రపథంలో నిలిపామన్నారు. ఇవేగాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా పెంపు, రుణమాఫీ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, డైట్ ఛార్జీలు 40 శాతం పెంపు,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో చేశామన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయలేనిది ఏడాదిన్నరలో చేసి చూపించాం. పది సంవత్సరాలలో పేదలకు రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆలోచన కూడా చేయలేదు. ఉన్న రేషన్ కార్డులలో పేర్లు కూడా నమోదు చేయలేదు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో పేరునమోదు కోసం ఎదురు చూస్తున్న 15 లక్షల మంది పేదల పేర్లను రేషన్ కార్డులలో నమోదు చేశాం. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులిచ్చాం. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది ఉన్నాకూడా పేదల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం రాజీ పడడం లేదన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లాస్థాయిలో పౌరసంబంధాల శాఖ అధికారులదేనని ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ జగన్ డిప్యూటీ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

# మద్యనిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి దోపిడీ

## వైసిపి హయాంలో ఏరులై పారిన అక్రమ మద్యం

## నిధులు దోచుకుని...ప్రజల ప్రాణాలు మింగేశారు

## రప్పారప్పా అని బెదిరిస్తే..బెదిరే వారు లేరు

## బదిరింపు రాజకీయాలను జగన్ మానాలి

## మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,**

మద్యం నిషేధిస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చి ఏం చేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఏరులై పారించిందని ఆరోపించారు. మద్య నిషేధం నినాదంతో అధికారంలోకి వైసీపీ వచ్చిందని.. కానీ ఆ హామీని జగన్ మర్చిపోయారని మండిపడ్డారు. అనేక మందికి నాసిరకం మద్యంతో లివర్ దెబ్బ తిని ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు.మంగళవారం పవన్ మీడియతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులు తినేశారు.. మరోవైపు జనం ప్రాణాలు తీశారని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. అయినా ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడ నిలబడ్డామని... ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహారించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించు కోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని పవన్ కళ్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహారిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సీఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సీఎంకు చెప్పిన అనంతరేమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.



# మళ్లీ పెరుగుతున్న కోవిడ్ కేసులు : నలుగురు మృతి



**న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 752 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక శుక్రవారం ఒక్కరోజే కరోనా వల్ల నలుగురు మృతి చెందారు. నిన్నటి కంటే ఈరోజుకి 423 యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రాలలోనే యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళలో 266, కర్ణాటకలో 66 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో శనివారానికి ప్రస్తుతం దేశంలో 3,420 యాక్టివ్ కేసులున్నాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. కాగా భారత్‌లో జెఎన్.1 సబ్ వేరియంట్ వ్యాప్తి పెరుగుతుండడంతో ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవాలో ఇప్పటివరకు 21 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇక కేరళలో కరోనా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 2,872 యాక్టివ్ కేసులు ఉన్నాయి. గడచిన 24 గంటల్లో 565 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ తెలిపింది.

# నేటి నుంచి నంది నాటకోత్సవాలు

## గుంటూరు విజ్ఞాన మందిరంలో ఏర్పాట్లు

**గుంటూరు జిల్లా ప్రతినిధి :**

రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాలు శనివారం నుంచి గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వారం పాటు జరగనున్నాయి. 73 అవార్డుల కోసం 38 నాటక సమాజాలు 1200 మంది నటీనటులు పోటీపడనున్నారు. ఈ ఉత్సవాలను మంత్రి చెన్నుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభించనున్నారు. నాటక ప్రదర్శనలు పరిశీలించి వాటికి స్వర్ణ, రజత, కాంస్య నందుల విజేతలను ఎంపిక చేయడానికి 15 మంది న్యాయ నిర్ణేతలు హాజరుకానున్నారు. శనివారం ఉదయం 11 గం. 'శ్రీ కాళహస్తీశ్వర మహత్యం' (పద్య నాటకం), మధ్యాహ్నం 2.30కు 'ఎర్ర కలువ', సాయంత్రం ఐదుగంటలకు 'నాన్నా%ూ% నేనొచ్చేస్తా%ూ%', 6 .30కు శ్రీ రామ భక్త తులసీ దాసు (పద్య నాటకం) ప్రదర్శించనున్నారు. కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ టి.విజరు కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు జరగనున్నాయి. నంది నాటకోత్సవాల సందర్భంగా గుంటూరు కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ రంగస్థల పురస్కారం, డాక్టర్ వైఎస్ఆర్ రంగస్థల పురస్కారానికి విజేతల ఎంపిక కోసం మొత్తం 27 మంది న్యాయనిర్ణేతలు సమావేశమై విజేతలను ఎంపిక చేశారు. ఎన్‌టిఆర్ రంగస్థల అవార్డు 2022 సంవత్సరానికి డా. మీగడ రామలింగ స్వామిని, డా. వైఎస్ఆర్ అవార్డు 2023 సంవత్సరానికి కాకినాడ యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఎంపిక అయినట్టు ఫిలిం డెవలప్‌మెం ట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు.

# క్యాబేజీ ఉత్పరివర్తనంలో పరివర్తనమా..!

క్యాబేజీ మొక్క డిఎన్ఏలోని ఒక చిన్న భాగాన్ని తొలగించడం ద్వారా తెగుళ్ళు రాకుండా పంట దిగుబడిని పెంచవచ్చని, ఇటీవల పరిశోధకులు వెల్లడించారు. బీజింగ్‌లోని చైనీస్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌కు చెందిన స్టేట్ కీ లేబొరేటరీ ఆఫ్ వెజిటబుల్ బయోబ్రీడింగ్ పరిశోధకుల ఫలితం విస్తారమైన పంటకు నాంది పలికింది. ఇప్పుడు మనం చూస్తున్న బిటి విత్తనాల కారణంగా మనకెదురవుతున్న నష్టం వీటి ద్వారా ఉండదని శాస్త్రవేత్తలు హామీ ఇస్తున్నారు. మరి అదేమిటో తెలుసుకుందాం. మన దేశంలో పూర్వం నుంచి సాంప్రదాయ వ్యవసాయం ఆనవాయితీ. అంటే పంట దిగుబడిలోంచి కొన్ని విత్తనాలను మరుసటి సంవత్సరం పంటకోసం దాచుకుని వాడుకోవటమే. కానీ 2002 నుంచి బిటి విత్తనాల ద్వారా అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రైతు బిటి విత్తనాలనాశ్రయించడంతో ఇప్పుడు వ్యవసాయమే నిస్సారమైపోయింది. మరి ఇప్పుడు చెప్పేదీ హైబ్రిడు విత్తనాల గురించే కదా.. అంటే ఒక తేడా ఉంది అంటున్నారు నిపుణులు. బిటి విత్తనాలంటే విత్తనం లోపలికి టాక్సిన్ ప్రోటీన్‌ను ఇంజెక్ట్ చేస్తారు. దాంతో పంట తయారైనప్పుడు కీటకాలు వాటిని తినలేవు. అయితే ఇప్పుడు ఈ బయో బ్రీడింగ్‌లో ఎలాంటి టాక్సిన్ మొక్కకు చేరదు. ఒక జన్యుభాగాన్ని తొలగించడం ద్వారా పంట దిగుబడిని పెంచవచ్చునన్నది ఈ ప్రయోగ ఫలితంగా చెబుతున్నారు పరిశోధకులు.



### న్యూక్లియోటైడ్ బేసెస్..

డిఎన్ఏ అణువు రెండు పొడవాటి తంతువులను కలిగి ఉంటుంది. ప్రతి తంతువు న్యూక్లియోటైడ్ బేసెస్ అని పిలువబడే నాలుగు సమ్మేళనాలతో కూడి ఉంటుంది. అవి ఎడినిన్, సైటోసిన్, గ్వానైన్, థైమిన్‌లు. వీటిద్వారా ఏర్పడే రసాయన బంధాలను హైడ్రోజన్ బంధాలు అంటారు. ఎడినిన్, థైమిన్ ఒకతంతువుపై, గ్వానైన్, సైటోసిన్ బేస్‌పెయిర్స్ అంటాము. ఇవి డిఎన్ఏ తంతువులను విడిపోకుండా కలిపి ఉంచుతాయి.క్యాబేజీ మొక్క (బ్రాసికా ఒలేరేసియా) జన్యువు 18 క్రోమోజోమ్‌లు, 1.06 బిలియన్ బేస్-జతలను కలిగి ఉంటుంది. ప్రతి కణం ఒక్కొక్కటి రెండు చొప్పున తొమ్మిది జతలను కలిగి ఉంటుంది. రెండు క్రోమోజోమ్‌ల జతల్లో, ఒక క్రోమోజోమ్ పుప్పొడి నుండి వస్తుంది. ప్రతి క్రోమోజోమ్ జతలోని డిఎన్ఏ ఒకే విధమైన బేస్-జతల క్రమాన్ని కలిగి ఉంటుంది.

### హైబ్రిడైజేషన్..

జతలోని క్రోమోజోమ్‌లలో ఒకదానిలో మాత్రమే ఉత్పరివర్తన జన్యువు ఉన్నట్లయితే, మొక్క పుప్పొడిని తయారుచేయదు. రెండు క్రోమోజోమ్‌లలో ఉంటేనే పుప్పొడి తయారై, పరివర్తన చెందుతుంది. అధిక సామర్థ్యం కలిగిన పురుష-స్టెరైల్ ఉత్పరివర్తన జన్యువుల ద్వారా హైబ్రీడ్ విత్తనాలు ఏర్పడతాయి. ఈ ప్రక్రియలో పుప్పొడి తయారయేటప్పుడు ప్రోటీన్ స్థాయి క్రమంగా ఉంటుంది. బేస్-పెయిర్‌ను తొలగించడం ద్వారా క్యాబేజీ పంటలో హైబ్రీడ్ విత్తనాలను ఉత్పత్తి చేయవచ్చు. ఆ తొలగించిన జన్యువు పేరు వీర-షస1. ఈ జన్యువును జూఖీ ప్రోటీన్ బంధిస్తుంది. అలా బంధింపబడిన సమయంలో ప్రోటీన్ తయారు కాకపోయినా, పుప్పొడిని కప్పి ఉంచకపోయినా ఆ జన్యువు సామర్థ్యాన్ని కోల్పోతుంది. అంటే వంధ్యత్వం వస్తుంది. వీర-షస1 ప్రోటీన్ స్థాయి సమతుల్యంగా ఉంటే ఉత్పరివర్తన సక్రమంగా జరిగి పంట దిగుబడి అధికంగా ఉంటుంది.ఇవి సహజ ఫలదీకరణ ద్వారా ఏర్పడిన విత్తనాల కంటే బలమైన మొక్కలను ఉత్పత్తి చేస్తాయి. ఎందుకంటే కృత్రిమ ఫలదీకరణ లేదా హెటిరోసిస్ వలన త్వరగా, బలంగా పెరిగేందుకు కావలసిన పోషకాలు మొక్కకు అందుతాయి. అయితే హైబ్రిడ్ మొక్కలు విత్తనాలనివ్వవు. సహజంగా ఫలదీకరణ చెంది, ఏర్పడిన విత్తనాలే మరల మొలకెత్తుతాయి. కానీ ఈ ఉత్పరివర్తన ద్వారా ఏర్పడిన విత్తనాలు వంధ్యత్వాన్ని పొందకుండా స్థిరంగా ఉంటాయని కొత్త అధ్యయనాలు వివరిస్తున్నాయి. అదే భవిష్యత్తులోనూ కొనసాగితే ఉత్పరివర్తన వంగడాల ద్వారా మంచి దిగుబడి పంటలను ఆశించగలం.

# సైన్స్ వైపు మళ్లిద్దాం..!

సైన్స్ అనేది నిత్యజీవితంలో ఒక భాగం. కానీ అది వాస్తవమని తెలిసినా.. మన ఆలోచనలు మాత్రం అశాస్త్రీయంగానే ఉంటాయి. ప్రతి మనిషి తనకు తెలియకుండానే సైన్సును ఆచరిస్తూనే ఉంటాడు. కానీ ఆ వైపుగానే మనం కొనసాగాలని చెబితే.. అంగీకరించేవారు తక్కువ. సైన్స్ లేనిదే జీవం లేదు. అందుకే ముందు పెద్దవాళ్లుగా మనం ఆ వైపు ఆలోచిస్తూ.. పిల్లల్ని సైన్స్ వైపు మళ్లించడం అవసరం.. ఆవశ్యం..నేడు మన చుట్టూ అనేక అశాస్త్రీయ ఆలోచనలు చుట్టుముట్టి ఉన్న తరుణంలో.. పిల్లల్ని సైన్స్ వైపు అడుగులు వేయించడం అవసరం. అందుకు ముందు పెద్దల ఆలోచనల్లో మార్పు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మనం మూఢ నమ్మకాల నుంచి బయటపడకుండా పిల్లల్ని ఆవైపు మళ్లించలేము.



### అపోహలు కల్పించొద్దు..

లేనివి ఉన్నట్లు.. ఉన్నవి లేనట్లు చెప్పడం అస్సలు చేయకూడదు. పిల్లలకు దెయ్యాల గురించి చిన్నప్పటి నుంచి కథల్లో చెప్తుంటాం. అవి లేవన్న వాస్తవం మనం ముందు అవగాహన చేసుకోవాలి. అలాంటి అభూత కల్పనల్ని వాస్తవమన్నట్లు చిత్రీకరించే భావజాలం పిల్లల్లో కలిగించవద్దు. అవి లేవనీ, కల్పన మాత్రమే అనేది చెప్పాలి. అలా చెప్పక పోతే పిల్లలు రాత్రివేళల్లో భయపడుతుంటారు. ఒంటరిగా బాత్రూమ్‌కి వెళ్లడానికీ వణికిపోతారు. అందులోనూ దెయ్యం అంటే తెల్లని దుస్తుల్లో ఉందని చెప్పడం మరింతగా అపోహలు కలిగించడమే. దీనివల్ల పిల్లలు చీకట్లో ఎవరైనా తెల్లని దుస్తుల్లో వస్తుంటే, దెయ్యమనే భ్రమపడతారు. అందుకే పిల్లలకు ఇలాంటి అపోహలు కల్పించవద్దు.

### అసత్యాలు చెప్పకండి..

పిల్లలకు పిల్లి ఎదురైతే కీడు జరుగుతుందని, ఎవరైనా తుమ్మితే వెళ్లడం ఆగిపోవాలని.. అలా చేయకపోతే వెళ్లే పని అవ్వదని చెప్పడం సరికాదు. పిల్లిని చూడటానికి కీడు జరగడానికి ఎలాంటి సంబంధం లేదు. అలాంటి అసత్యాలు పిల్లలకు చెబితే పనులపై అలసత్వం ఏర్పడుతుంది. అలాగే తుమ్ము రావడానికి మనం వెళ్లేదానికీ పొంతనే లేదు. సమయానికి వెళ్లకపోతే పనులు జరగకపోవడం ఖాయం. అంతేగానీ తుమ్ములతో కూర్చుంటే అసలుకే పనికాదు. ఇలాంటివి పిల్లలకు చిన్నప్పటి నుంచి చెప్పడం వల్ల మూఢనమ్మకాలను నేర్పించినవారమవుతాం. గ్రహణాల గురించి కూడా పెద్దలం చాలా అపోహలకు లోనవుతుంటాం. అవే పిల్లలకు నేర్పిస్తూ ఉంటాం. ఇందులో సైన్స్ తెలుసుకుని, పిల్లలకు చెప్పండి.

### వక్రీకరణలు ఆపండి..

పిల్లలకు ఈ రోజుల్లో మూరు?లు చెప్పే మాటల్ని పట్టుకుని వక్రీకరణలు వాస్తవంగా చెప్పకండి. అవి పక్కా వక్రీకరణలే. ప్లాస్టిక్ సర్జరీ పురాణకాలంలోనే జరిగిందనీ, విమానాలు కూడా అప్పుడే కనిపెట్టారనే మాటలన్నీ బూటకాలే. ప్రజల్ని పక్కదారి పట్టించేవిలాంటి అభూతకల్పనలను మీరూ నమ్మకండి.. పిల్లలకీ చెప్పకండి.. ఇలాంటి వక్రీకరణలను ఎండగట్టాలి.

### ప్రయోగాలకు నిలబడాలి..

ఏదైనా ప్రయోగాలకు నిలబడాలి. నిరూపితం కానివి అబద్ధాలే. అందుకే మీరు నిర్ధారణకు రావాలన్నా.. ఎవరేమి చెప్పినా ప్రయోగానికి నిలిస్తేనే నమ్మండి. అదే విషయం పిల్లలకూ చెప్పండి. ఏదైనా చెప్పినప్పుడు అది ఎలాగో నిరూపించమని నిలదీయాలి. సైన్స్ ఎప్పుడూ పరిశోధనలతో తేటతెల్లం చేసినవే చెప్తుంది. భూమి ఏర్పడిన దగ్గర నుంచి.. ఆకాశం, నీరు అన్నీ మీకు తెలియకపోతే తెలియదని చెప్పండి. అంతేగానీ.. లేనిపోనివి కల్పించి చెప్పకండి. వర్షం ఎందుకు? ఎలా? ఎక్కడ నుంచి అంటే.. చాలామంది తల్లిదండ్రులు దేవుడు స్నానం చేస్తున్నాడనీ, మూత్రం పోసుకుంటున్నాడనీ కథలు చెప్తుంటారు. కానీ వర్షం ఎలా? ఎందుకు? ఎక్కడ నుంచి పడుతుందో తెలిసినా చెప్పరు. ఇదే పిల్లల్ని మూరు?లుగా, తెలియనివారిగా తయారుచేస్తుంది.మనిషి పుట్టుక కూడా ఎలా జరిగిందో మనకు తెలుసు. కానీ ఆ జీవ పరిణామక్రమాన్ని మాత్రం పిల్లలకు చెప్పం. దీనివల్ల పిల్లలు సైన్సు కన్నా.. ఇలాంటి అపోహల్నే నమ్ముతూ ఎదుగుతారు. కొందరు పిల్లల్ని చిన్నప్పటి నుంచి ప్రశ్నిస్తుంటారు. మన దగ్గర సరైన సమాధానం లేనప్పుడు.. వాళ్లను నోరుమూయిస్తుంటాం. అది సరికాదు. తెలియంది తెలుసుకుని చెప్పండి. తెలియకపోతే అది పిల్లల వద్ద ఒప్పుకోండి. అంతేగానీ.. విసుక్కుని వాళ్ల జిజ్ఞాసను అణచివేయొద్దు. శాస్త్రీయంగా ఆలోచిస్తేనే మానవుడు మొన్న చంద్రయాన్-3 వరకూ ఎదిగాడు. అంతరిక్షంలోకి వెళ్లగలిగాడు. ఈ రోజు మనమంతా ఇలా ఉన్నామంటే సైన్స్ వల్లే. ఎలాంటి రోగాలకైనా మందులు కనిపెట్టగలుగుతున్నారంటే సైన్స్ కారణం.

# కళ్లకు గంతలతో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన



**మన్యం :**

రాష్ట్రవ్యాప్తంగా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారంతో నాలుగో రోజుకు చేరింది. ప్రతిపక్ష హోదాలో పాదయాత్ర సందర్భంగా %ూ% జగన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందర్నీ రెగ్యులర్ చేస్తానన్న హామీని అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 4 నెలల పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని, పీఎఫ్, ఈ.ఎస్.ఐ అమలుచేయాలని ఉద్యోగులంతా నినాదాలు చేశారు. మన్యంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులంతా నల్లటి రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

# 12వ రోజు కొనసాగుతోన్న అంగన్వాడీల నిరవధిక సమ్మె

**అమరావతి :**

తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంతో 12వ రోజుకు చేరుకుంది. కనీస వేతనం అమలు చేయాలని, అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కార్యక్రమాన్ని వివిధ రూపాలలో ఉద్రిక్త చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చెవిలో పూలు పెట్టుకొని పలుచోట్ల ధర్నా నిర్వహించారు.



# న్యాయ సమస్యలు

న్యాయం చేయడం ఆలస్యమైతే అన్యాయం చేసినట్టే అనేది పెద్దల మాట. ఓ విచారణ ఖైదీ తన కేసు కోర్టు ముందుకు రావడానికే పదేండ్ల కాలం ఎదురుచూడాలా? ముదివగ్గులు తమ ఆస్తి తగాదాల పరిష్కారానికి 30-40 ఏండ్లు ఓపిక పట్టగలరా? మన దేశంలో న్యాయవ్యవస్థ ఎదుర్కొనే అతిపెద్ద సమస్య పెండింగ్ కేసులు. 'న్యాయవ్యవస్థ స్థితిగతులు' అనే శీర్షికతో సుప్రీంకోర్టు ఆధ్వర్యంలోని పరిశోధన, ప్రణాళిక కేంద్రం ఇటీవల వెలువరించిన ప్రత్యేక నివేదిక దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. పెండింగ్ కేసులు గుట్టలుగా పేరుకుపోవడం వెనుక గల కారణాలను కొంత మేర విశ్లేషించింది.దేశంలోని వివిధ కోర్టుల్లో 2023 అక్టోబర్ నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 5 కోట్ల పై చిలుకే. మూడంచెల న్యాయవ్యవస్థలోని సుమారు 20,580 మంది న్యాయమూర్తులు వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. హైకోర్టు జడ్జి స్థానాల్లో 30 శాతం, జిల్లా జడ్జి పోస్టుల్లో 20 శాతం ఖాళీగా ఉన్నాయి. కేసుల సంఖ్యకు, జడ్జిల సంఖ్యకు మధ్యన పొంతన లేకపోగా అందులో భారీస్థాయిలో ఖాళీలున్నాయని దీనిద్వారా స్పష్టమవుతున్నది. జనాభా ప్రాతిపదికన జడ్జిల సంఖ్యను పెంచాలని వచ్చిన ప్రతిపాదనను సుప్రీంకోర్టు 2002లో సమర్థించింది. కేసుల సంఖ్యను బట్టి జడ్జిలను నియమించాలని 2014లో లా కమిషన్ సూచించింది. ఇలా వేర్వేరు కమిటీలు కొత్త కొత్త ప్రతిపాదనలు ముందుకు తెస్తూనే ఉన్నాయి. ఖాళీల భర్తీలో జరిగే జాప్యం మరో సమస్య. దేశంలో కేవలం 9 రాష్ట్రాలు మాత్రమే నిర్దేశిత సమయంలో భర్తీలు పూర్తి చేయగలుగుతున్నాయని సుప్రీంకోర్టు జరిపించిన అధ్యయనంలో వెల్లడైంది.

ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశంలో జనాభా-జడ్జి నిష్పత్తి అట్టడుగుస్థాయిలో ఉన్నది. అత్యధిక జనాభా కలిగిన చైనాలో 10 లక్షల జనాభాకు 300 మంది జడ్జిల చొప్పున ఉన్నారు. అదే అమెరికాలో 150 మంది ఉన్నారు. మన దేశంలో పది లక్షల జనాభాకు కేవలం 20-21 మంది జడ్జిలున్నారు. మన దేశంలో పెండింగ్ కేసులను బట్టి చూస్తే జడ్జిల సంఖ్య చాలా చాలా పెంచాల్సి ఉందనేది నిర్వివాదాంశం. ఇక న్యాయ నియామకాల విషయంలోనూ ఒక్కో దేశంలో ఒక్కో పద్ధతి ఉంటుంది. మౌలికంగా చూస్తే రాజకీయ, రాజకీయేతర నియామకాలుంటాయని చెప్పాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన బ్రిటన్‌లో న్యాయ నియామకాలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జ్యుడిషియల్ కమిషన్ అజమాయిషీలో స్వేచ్ఛగా జరుగుతాయి. పార్టీ రాజకీయాలకు ఈ నియామకాల్లో ఏ మాత్రం ప్రమేయం ఉండదు. కాగా అమెరికాలో న్యాయ నియామకాలు ప్రభుత్వాధినేతల కనుసన్నల్లో జరుగుతాయి. మన దేశంలో ఉన్నత న్యాయస్థానాల ఖాళీల భర్తీలు, బదిలీలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థపై సర్వోన్నత న్యాయస్థానానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నియామకాలు న్యాయ పర్యవేక్షణలో కాకుండా ప్రభుత్వ అజమాయిషీ కింద జరిగేలా చూసేందుకు కేంద్రం తలపెట్టిన న్యాయ నియామకాల చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. తదనంతర కాలంలో కొలీజియం సిఫారసులపై జాప్యం జరుగుతుండటంతో కొంత అస్థిరత నెలకొంటుండటం చూస్తున్నాం. మన దేశంలో ఒక అంచనా ప్రకారం.. సగటున ఒక కేసు విచారణకు హైకోర్టుల్లో మూడేండ్ల ఒక నెల పడుతుంది. అదే జిల్లా కోర్టుల్లోనైతే ఆరేండ్లు పడుతుంది. అమెరికాతో సహా పలు అభివృద్ధి చెందిన దేశాల్లో 6 నెలల నుంచి సంవత్సరం కాలంలో కేసు పరిష్కారమవుతుంది. మనం ఆ స్థాయిని అందుకోవడం ప్రస్తుతానికైతే దాదాపు అసాధ్యమనే చెప్పాలి.న్యాయ నియామకాల్లో జాప్యంతో పాటుగా పదే పదే దృష్టికి వచ్చే మరో సమస్య సామాజిక సమగ్ర ప్రాతినిధ్యం. విస్తృత సామాజిక, భౌగోళిక, మతపరమైన వైవిధ్యం కలిగిన దేశం మనది. ఆ సమగ్రత న్యాయ నియామకాల్లో ప్రతిఫలిస్తేనే ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కుదురుతుంది. మహిళా జడ్జిల సంఖ్యతో పాటుగా వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని కూడా నివేదిక విశ్లేషించింది. జడ్జిల నియామకాల్లో సామాజిక వర్గాల వారీగా ప్రాతినిధ్యం గురించిన లెక్కలను ఇటీవల కేంద్ర న్యాయశాఖ పార్లమెంటుకు సమర్పించింది. హైకోర్టు జడ్జిల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు 25 శాతం, సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తులు కేవలం ముగ్గురు (8.85 శాతం) మాత్రమే ఉండటం ఆలోచించాల్సిన విషయమే. అయితే హైకోర్టుల్లో ఈ సంఖ్య కాస్త మెరుగ్గా 14.1 శాతంగా ఉన్నది. మన ఉన్నత న్యాయస్థానాల్లో సామాజికవర్గాల వారీగా నియామకాలు జరుగవనేది తెలిసిందే.

# నయా బానిసత్వానికి విముక్తి ఎన్నడు?



శ్రమ దోపిడీ ఓ సామాజిక దురాచారం. సాంకేతిక యుగంలోనూ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శ్రమ దోపిడీకి గురవుతున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు అందక.. ఎక్కువ సమయం పని చేస్తూ యజమానుల చేతుల్లో బానిసలుగా మారుతున్నారు. వారి చేతుల్లో బందీలుగా మారిపోయి వెట్టిచాకిరి బాధితులుగా మిగిలిపోతున్న వారు కోకొల్లలు.ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వలసపోతున్న వారిలో అత్యధికులు వెట్టిచాకిరి బారిన పడుతున్నారు. ఒక నిర్ణీత సమయం అంటూ లేకుండా వారంతా గొడ్డు చాకిరి చేస్తున్నారు. పొద్దు పొడిచిన దగ్గరి నుంచి పొద్దుపోయే వరకు అహర్నిశలు శ్రమించే వారికి సరైన కూలీ కూడా అందకపోవడం విచారకరం. ఇటుక బట్టీల నుంచి పెద్దపెద్ద పరిశ్రమల వరకు మనకు తారసపడిన వారిని ఒకసారి పలకరిస్తే అసలు విషయం తెలుస్తుంది. వారక్కడ ఇష్టంగా పని చేస్తున్నారా? లేదా బలవంతంగా పని చేయాల్సి వస్తున్నదా? అనేది అవగతం అవుతుంది. అప్పులు, ముందస్తు చెల్లింపుల కారణంగా లక్షల మంది ఇప్పటికీ అయిష్టంగానే వెట్టిచాకిరి చేస్తున్నారు. ఒకరి కింద బానిసలాగా బతకాలని ఎవరికి మాత్రం ఉంటుంది. కానీ, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మన దేశంలో జనాభాకు తగ్గట్టుగా ఉపాధి కల్పన లేకపోవడం తదితర కారణాల వల్ల లక్షల మంది ఈ సామాజిక దురాచారానికి గురవుతున్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం బలవంతంగా పని చేయించడం, మానవ అక్రమ రవాణా నేరం. దాన్ని రూపుమాపడం ప్రభుత్వాల బాధ్యత. వెట్టిచాకిరి బాధితులు ఎక్కడ కనిపించినా వారికి విముక్తి కల్పించి పునరావాసం కల్పించాలి. 1978లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం బాధితుల పునరావాసం కోసం రూ.4,000 ఆర్థిక సాయం చేయాలి. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చట్టంలో పొందుపరిచారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా దీన్ని 2000 సంవత్సరంలో రూ.20 వేలకు, 2022లో రూ.30 వేలకు పెంచారు. ప్రత్యేక పరిస్థితుల్లో పురుషులకు రూ.లక్ష, మహిళలు, బాలలకు రూ. 2 లక్షలు, లైంగిక వేధింపులకు గురైనవారికి రూ.3 లక్షల వరకు పునరావాసం కోసం సాయం చేసేలా జిల్లా కలెక్టర్లకు వెసులుబాటు కల్పించారు. దీంతో పాటు వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందినట్టు ఓ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జారీ చేయాలి. విముక్తి పొందిన వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తున్న ప్రభుత్వాలు.. బాధితులకు పునరావాసం కల్పించడంలో అలసత్వం వహిస్తున్నాయి. ఆర్థిక సాయం చేయాల్సి ఉండటంతో ఈ విషయంలో ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో వారంతా కొంతకాలానికి కొత్త ప్రాంతానికి వెళ్లి అక్కడ తిరిగి వెట్టిచాకిరి బాధితులుగా మారుతున్నారు.వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి, వారికి పునరావాసం కల్పించే విషయంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయనే చెప్పాలి. 1978 నుంచి చూసుకుంటే కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం ఇప్పటివరకు 3,15,302 మంది వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందారు. వారిలో 2,96,305 మందికి ప్రభుత్వం పునరావాసం కల్పించింది.2030 నాటికి 1.8 కోట్ల మందిని వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో సంకల్పించింది. ఆ నాటి నుంచి చూసుకుంటే 32,873 మందికి మాత్రమే విముక్తి కల్పించడం గమనార్హం. అంటే సరాసరి ఏడాదికి సుమారు 4,696 మంది విముక్తి పొందారు. భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న 1.8 కోట్ల లక్ష్యంలో ఇది సుమారు 2 శాతం.ఇప్పటి వరకు విముక్తి పొందిన బాధిత కార్మికులు ఎక్కువగా ఐదు రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. కర్ణాటక (66,281), తమిళనాడు (65,573), ఒడిశా (51,441), ఉత్తరప్రదేశ్ (42,279), ఆంధ్రప్రదేశ్ (38,141) ముందు వరుసలో ఉన్నాయి. ఇది 84 శాతం.నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీలే బాధితులుగా ఉండటం బాధాకరం. 2019లో ఈ చట్టం కింద 1,155 కేసులు నమోదవగా.. వాటిలో 96 శాతం బాధితులు ఎస్సీ, ఎస్టీలే. 2020లో నమోదైన 1,231 కేసుల్లో 94 శాతం, 2021లో నమోదైన 592 కేసుల్లో 96 శాతం వారే బాధితులు. నమోదైన కేసుల సంఖ్యతో సమానంగా విముక్తి కల్పించిన వారి సంఖ్య లేకపోవడం విచారకరం. విముక్తి కల్పిస్తున్నప్పటికీ వారి వివరాలు బయటికి రావడం లేదనేది ఓ వాదన. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, రాజకీయ నేతల హస్తం ఉండటం తదితర కారణాల వల్ల కొన్ని సందర్భాల్లో జిల్లా యంత్రాంగాలు ఈ వివరాలను బయట పెట్టడం లేదని తెలుస్తున్నది.మారుతున్న కాలానికి అనుగుణంగా వెట్టిచాకిరిలోనూ మార్పులు సంభవిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా ఆధునిక బానిసత్వం పుట్టుకొచ్చింది. ఈ బానిసత్వంలో అనేకమంది తమ కుటుంబాల కోసం యాజమాన్యాలను ప్రశ్నించకుండా మిన్నకుంటున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు లేకపోయినా సర్దుకుపోతున్నారు. వారికి కార్మిక చట్టాలు, శ్రమకు తగ్గ వేతనాలు అమలు కావడం లేదు. ఓ సంస్థ అంచనా ప్రకారం మన దేశంలో 1.1 కోట్ల మంది ఆధునిక బానిసత్వంలో మగ్గుతున్నట్టు తేలింది. వారిలో 83 శాతం మంది ఎస్సీ, ఎస్టీలే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో ఇరాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, భారత్‌లో మాత్రమే ఈ ఆధునిక బానిసత్వాన్ని రూపుమాపేందుకు సరైన ప్రణాళికలు లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

# భారతీయ పరిమళం విశ్వవ్యాప్తం

కొవిడ్ మహమ్మారి మానవాళికి ఎన్నో పాఠాలు నేర్పింది. కరోనా నేర్పిన గుణపాఠం ప్రజల్లో చాలా మార్పులు తీసుకువచ్చింది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ప్రజలు సేంద్రియ ఉత్పత్తులను వాడేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. సేంద్రియ విధానంలో సాగైన పూలతో సహజసిద్ధంగా తయారయ్యే సుగంధ పరిమళాలకు కూడా గిరాకీ పెరగడంతో 'ది ఫెర్ఫ్యూమ్ సిటీ ఆఫ్ ఇండియా'గా పేరొందిన కనౌజ్ వెలుగొందుతున్నది.గతంలో కళ తప్పిన మన దేశంలోని అత్తరు పరిశ్రమ ప్రస్తుతం కళకళలాడుతున్నది. కొవిడ్ తర్వాత మారిన ప్రజల అలవాట్ల కారణంగా ఇప్పుడిప్పుడే ఆ పరిశ్రమ పుంజుకుంటున్నది. మహమ్మారి కారణంగా ఉపాధి కోల్పోయిన యువత ఈ పరిశ్రమకు ఊపిరులూదారు. తద్వారా శతాబ్దాల నాటి కళను బతికించడమే కాకుండా అనేకమంది ఉపాధికి మార్గం సుగమం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌ల సంస్కృతి అత్తరు పరిశ్రమకు పాకింది. తద్వారా బూండ్ ఫ్రాగ్రెన్సెస్, కస్తూర్, నాసో ప్రొఫ్యూ మి తదితర స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. ఈ స్టార్టప్‌లలో అత్యధికం మహిళా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్నవే.

మన దేశంలో సుగంధ పరిమళాలు, రుచికి సంబంధించిన పరిశ్రమల ద్వారా ఏటా జరుగుతున్న వ్యాపారం సుమారు రూ.10 వేల కోట్లపైనే. అత్తరు, సువాసనలు, సుగంధ పరిమళాలల్లో వినియోగించే నూనెల వాటా ఇందులో సగంపైనే ఉంటుంది. ఈ రంగంలో ప్రపంచ మార్కెట్‌లో భారత్ వాటా సుమారు 10 శాతం. రానున్న ఐదేండ్లలో అత్తరు పరిశ్రమ మరింత వృద్ధిని సాధిస్తుందని మార్కెట్ రిసెర్చ్ సంస్థ టెక్నావియో అంచనా వేసింది. టెక్నావియో ప్రకారం.. ఏటా 15 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నది.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కనౌజ్ నగరం సహజ సిద్ధమైన సుగంధ పరిమళాల పరిశ్రమకు ప్రసిద్ధి. శతాబ్దాల కిందటే కనౌజ్‌లోని వేల కుటుంబాలు అత్తరు తయారీలో నైపుణ్యం సాధించారు. డెగ్-భక్పా అనే ప్రాచీన పద్ధతిలో తయారుచేసే అత్తరుకు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉన్నది. మొఘలుల కాలంలో అత్తరు తయారీ ప్రారంభమైందని, అప్పటినుంచే కనౌ జ్ అత్తరు పరిశ్రమకు ప్రసిద్ధి గాంచిందని పలువురు నిపుణులు చెప్తుంటారు. అయితే కొంతమంది చరిత్రకారులు ఈ వాదనను ఖండిస్తున్నారు. మొఘలులు మన దేశానికి రాకముందు నుంచే అత్తరు పరిశ్రమ మన దేశంలో ఉన్నదని చరిత్రకారులు అంటున్నారు. సింధూ లోయలో జరిపిన తవ్వకాల్లో సుగంధ పరిమళాలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించడం వారి వాదనకు బలం చేకూరుస్తున్నది.1980ల్లో తీసుకొచ్చిన సంస్కరణల ధాటికి దేశంలోని అత్తరు పరిశ్రమ కుదేలైంది. పశ్చిమ దేశాల నుంచి చౌకైన అత్తరు రాకతో చాలా పరిశ్రమలు మూతపడ్డా యి. 1990ల్లో కనౌజ్ పరిసర ప్రాంతాల్లో సుమారు 700 పరిశ్రమలుండేవి. 2000ల నాటికి ఆ సంఖ్య 150-200కు



పడిపోయింది. చౌకైన సింథటిక్, ఆల్కహాల్ ఆధారిత సుగంధ పరిమళాల కారణంగా అక్కడి పరిశ్రమలు పోటీలో వెనుకబడ్డాయి. అతి ఖరీదైన శాండల్‌వుడ్ (చందనం) నూనెలను వినియోగించడం వల్ల స్వదేశీ అత్తరు ధరలు భారీగా ఉండేవి. అదే సమయం లో పశ్చిమదేశాల సుగంధ పరిమళాలు అతిచౌకగా లభించేవి. పోటీని తట్టుకునేందుకు స్వదేశీ పరిశ్రమలు కూడా ఆల్కహాల్‌ను వాడటం ప్రారంభించడంతో ఈ కళ అంతరించే దశకు చేరుకున్నది.కొవిడ్ కారణంగా కొత్తకొత్త రంగాల్లో అడుగుపెడుతున్న యువత.. దీనిపై కూడా దృష్టిసారించింది. దేశంలోని చేతివృత్తిదారులు, మారుతున్న వినియోగదారుల సంస్కృతికి మధ్య ఉన్న అంతరాన్ని కొత్త తరం పసిగట్టింది. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా అంతరించిపోయే దశలో ఉన్న ఆనాటి కళను నేటి యువత తెరపైకి తీసుకొచ్చింది. పలువురు పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌ల ద్వారా అత్తరు పరిశ్రమ కు మళ్లీ పురుడుపోశారు. సేంద్రియ పద్ధతుల్లో పం డించిన పూలను వాడుతూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మట్టి, వాన కురిసేటప్పుడు వచ్చే వాసన తదితర ప్రత్యేక వెరైటీలతో విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగారు. ఐరోపా, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల్లో వీటికి గిరాకీ ఎక్కువ. ఆల్కహాల్ లేకపోవడంతో అరబ్ దేశా ల్లో వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల ప్రాంతాల్లో పూలు సాగు చేసే రైతులు లాభాల బాటపట్టారు. శీతాకాలం, పెండ్లిళ్ల సీజన్, క్రిస్మస్, రంజాన్ తదితర పర్వదినాల సమయంలో వీటికి డిమాండ్ ఉంటున్నది. 6 ఎంఎల్ అత్తరును 20 డాలర్లకు విక్రయిస్తున్నారంటేనే వీటికున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సుగంధ పరిమళాల పరిశ్రమకు కేంద్ర ప్రభు త్వం ప్రోత్సాహం అందించి వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉన్నది.

# మన సంస్కృతిలోనే బోలెడన్ని సూక్ష్మాలు

## ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డి.బి. రామాచారి

హైదరాబాద్



భారతీయ ఇతిహాసం, సంస్కృతి – సంప్రదాయాలలోనే బోలెడన్ని సూక్ష్మాలు ఉన్నాయని, వాటిని నిశితంగా ఆకళింపు చేసుకుని అత్యాధునిక పరిశోధనలో వినియోగించుకోవాలని హైదరాబాద్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రముఖ రసాయన శాస్త్రవేత్త ప్రొఫెసర్ దేవలపల్లి బి. రామాచారి సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'స్వామినాథన్ కీటోన్ల ఉత్ప్రేరక అసమాన సంశ్లేషణ' అనే అంశంపై మంగళవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఉత్నేరక, సేంద్రీయ సంశ్లేషణ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ రామాచారి, తన ప్రయోగశాల, తన విద్యార్థులు చేపట్టిన ముఖ్యమైన పరిశోధన ఫలితాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూమిపై జీవం ఉన్నంత కాలం, సేంద్రీయ రసాయన శాస్త్రం (ఆర్గానిక్ కెమిస్ట్రీ) కీలకంగా ఉంటుందంటూ, శాస్త్రీయ పురోగతిలో దాని ప్రాథమిక పాత్రను విడమరిచి చెప్పారు. స్వామినాథన్ కీటోన్స్ యొక్క చారిత్రక, శాస్త్రీయ అంశాలను పరిశీలిస్తూ, ఆయన తొలిసారిగా 1966లో బైసైక్లో అండెకేన్ అస్థిపంజరాలను ఎలా కనుగొన్నారో డాక్టర్ రామాచారి వివరించారు. ఇప్పుడు స్వామినాథన్ కీటోన్స్ అని విస్తృతంగా పిలువబడే ఈ నిర్మాణాలు వివిధ అల్కలాయిడ్ల సంశ్లేషణకు కీలకమైన సింథాన్లుగా పనిచేస్తాయన్నారు. ఆధునిక రసాయన పరిశోధనలో వాటి ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ. ఈ కీటోన్ల నిర్ధారణ, నియంత్రిత ఉత్ప్రేరక అసమాన సంశ్లేషణను విపులీకరించారు. భారతీయ ఇతిహాసం మహాభారతం నుంచి ఒక ఆకర్షణీయమైన సారూప్యతను ఉపయోగించి, యాన్యులేషన్ ద్వారా థియాబిసైక్లో నోనేన్ల అసమాన సంశ్లేషణను డాక్టర్ రామాచారి విడమరచి చెప్పారు. తిరిగే చేప ప్రతిబింబాన్ని గమనించడం ద్వారా, దాని కన్నుపై గురిపెట్టే అర్జునుడి పురాణ విన్యాసం నుంచి ప్రేరణ పొంది. ఆర్గానోక్యాటలిటిక్ ప్రతిచర్యలు బహుళ అవకాశాలలో ఒక నిర్దిష్ట ఉత్పత్తిని ఎలా లక్ష్యంగా చేసుకోవచ్చో వివరించారు. ఇది ఆర్గానోక్యాటాలిసిస్ లో 'ఉత్పత్తి జ్ఞాపకశక్తి' అనే భావనపై విస్తృత చర్చకు దారితీసింది. ఇక్కడ ఉపరితలాలు, ఉత్ప్రేరకాలు అధిక ఎంపిక, ఖచ్చితత్వంతో కలిపి పనిచేస్తాయన్నారు. సాంస్కృతిక కోణాన్ని జోడిస్తూ, ప్రొఫెసర్ రామాచారి సైక్లో ఆక్టేన్ల సంశ్లేషణలో కీలకమైన బంధం ఏర్పడటాన్ని పౌరాణిక సేతుబంధనం లేదా రామ సేతుతో పోల్చారు. ఇది దైవిక వంతెనను నిర్మించడానికి సమానమైన పరమాణు చట్రాల యొక్క ఖచ్చితమైన నిర్మాణాన్ని సూచిస్తుందన్నారు. ఈ ఆతిథ్య ఉపన్యాసాన్ని పలువురు అధ్యాపకులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు తదితరులు ఆసక్తిగా విని, తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ప్రొఫెసర్ రామాచారి తన ఆలోచనాత్మక ఉపన్యాసంలో విలువైన అంతర్దృష్టులను అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం భవిష్యత్ పరిశోధన సహకారం, మేధో అన్వేషణకు స్ఫూర్తిదాయక వేదికగా నిలిచింది.

## తెలంగాణ వేగుచుక్క దాశరథి



హైదరాబాద్,

తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహా కవి దాశరథి కృష్ణమా చార్య శత జయంతి సందర్భంగా– వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎన్ బాలా చారి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో దాశరథి గారి గురించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని ఆయన పేరుమీద ప్రత్యేక సంచిక తీసుకొచ్చామని ఈ ఏడు రోజులు వారి సప్తాహం నిర్వహిస్తామని ఈరోజు ఉప్పల్ డిగ్రీ కళాశాలలో వారి శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి వారు అన్నారు ప్రముఖ కవి, విశ్లేషకులు రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ ఆనాటి కవులు ప్రజల పక్షాన నిలబడి ప్రజలను చైతన్యవంతం చేసిన కవులు అందులో దాశరథి మొదటి వరసలో ఉంటాడని ఆయన అన్నారు మా నిజాం రాజు జన్మజన్మల బూజు ముసలి నక్కకు రాజరికం దక్కునే , తెలంగాణలో అగ్నిధార కురిపించారు అని ఆయన సేవలు కొనియాడారు నిజాంబాద్ జైల్లో వట్టికోట అలవర స్వామి దాశరథి గారు బొగ్గుతో నా తెలంగాణ కోటి రతనాల వీణ ముసలి నక్కకు రాజ్యం దక్కిందని వాక్యాలు రాయడం జరిగింది తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా%శ్రీశ్రీ౹ా%. బడే సాబ్ మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఎర్రజెండా పట్టుకుని నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాటం చేసి జైలు జీవితం అనుభవించిన మహోన్నతుడు మన దాశరథి నేటి యువత ఆయనను స్ఫూర్తి తీసుకొని ఎలా ఉండాలో ఎలా మెదగాలో ఎలా రాయాలో అనే అందరూ ఆచరించాలని ఆయన అన్నారు ఒక ఉద్యమ కవిగా ఆనాటి యువతకు ఎంతో స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లారని ఆయన రచనలు అన్నీ గొప్పవే ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆస్థాన కవిగాకూడా పనిచేసిన వ్యక్తి దాశరథి ,శ్రీమతి సమ్మెట విజయ లక్ష్మి గారు పాల్గొని దాశరథి నివాళులు అర్పించారు. .

## ఫ్రీజింగ్‌లో ఉన్న ధళితబంధు నిధులు విడుధల చెయ్యాలి



మహాదేవపూర్/

కాటారం మండల కేంద్రంలో దళిత బంధు లబ్ధిదారులు సోమవారం సమావేశం ఏర్పటు చేశారు. ఈ స సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఏన్నికల కంటే ముందు ధళితబంధు నిధులు విడుదలపై స్పష్టమైనా ప్రకటన చేసి ఫ్రీజింగ్ లో ఉన్న నిధులు విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధళిత బందు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని దళిత బందు నిధుల విడుదల కై అనేక చోట్లల్లో ధర్నాలు చేస్తుంటే ఈ అంశం పై ప్రభుత్వ యంత్రగంలో చర్చ జరుగుతుందని తెలియచేసారు. ప్రభుత్వం ఈ ఆశం పై ప్రత్యేక చర్య తీసుకొని ఫ్రీజింగ్ లో ఉన్న దళిత బంధు నిధులు విడుదల చేసి దళిత కుటుంబాల అభివృద్ధికి కృషి చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బ్లాక్మెయిల్ పాల్పడుతున్న రిపోర్టర్ అని చెప్పుకుని తిరుగుతున్నా వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేసిన కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా/



యూట్యూబ్ ఛానల్ పేరుతో ప్రజలను,అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతూజర్నలిజం వృత్తికే విలువ లేకుండా చేస్తున్న రిపోర్టర్ అని చెప్పుకుని తిరిగే వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి కాకతీయ క్లబ్ జర్నలిస్టులు కోరారు. మంగళవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ను వేరు వేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నివాసము ఉంటూ యూట్యూబ్ ఛానల్,పత్రిక పేరుతో ఇష్టారాజ్యంగా చలామణి అవుతు మరో పత్రికలో (న్యూస్ భూమ్) అక్రిడేషన్ కార్డు పొంది (కార్డు నం జెఎస్ బీడీ 03) పని చేస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు. తాను నడిపిస్తున్న యూట్యూబ్ చానెల్ కు అనుమతులు,హక్కులు లేవనీ ఫిర్యాదులో తెలిపారు. సమాజంలో తాను జర్నలిస్టునని చెబుతూ బ్లాక్మెయిల్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. సదరు నకిలీ విలేకరి పైన పెద్దపెల్లి,భూపాలపల్లి,హుజురాబాద్ పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదు తో పాటు భూపాలపల్లిలో రౌడీషీట్ కేసు ఉందని సూచించారు. ప్రజలను అధికారులను బెదిరింపులకు పాల్పడుతూ జర్నలిస్టుగా చెలమని అవుతున్న నకిలీ విలేకరి అక్రిడేషన్ కార్డును రద్దు చేయాలని,ఆయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ప్రెస్ క్లబ్ కు చెందిన 80 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.



## వీధిలైట్లు వెలగక అంధకారంలో పలు గ్రామాల ప్రజలు

### నిధులు రాక అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడుతూ అప్పుల పాలవుతున్నామంటున్న గ్రామ కార్యదర్శులు: సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రణపంగ కృష్ణ

పెన్ పహాడ్



ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదని స్వంత ఖర్చు పెట్టుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాల్సి వస్తుందని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ మోటార్లు కాలిపోతే మరమ్మతులు జరిపించాలంటే అందుకు అయ్యే ఖర్చు కార్యదర్శులే భరించాల్సి వస్తుందన్నారు. వీధిలైట్లు వెలగకపోయినా కొత్త లైట్లు వేయించడం, ఏ సమస్య వచ్చినా పరిష్కార బాధ్యత కార్యదర్శులకు అప్పగించడంతో నిధులు లేక సొంత ఖర్చులతో పనులు చేస్తూ అప్పుల పాలవుతున్నారన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని వైద్య ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కల, కోతుల బెడద తీవ్రంగా ఉందని అవి మనుషులపై దాడులు చేయడంతో పాటు గొర్రెలు, మేకలను చంపుతున్నాయని కుక్కల, కోతుల బెడదను నివారించాలని అధికారులను కోరుతున్నామన్నారు. గ్రామ కార్యదర్శులకు రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా గ్రామ పంచాయతీలకు నిధులు వెంటనే విడుదల చేసి గ్రామాలలో నెలకొని ఉన్న వీధిలైట్ల సమస్య, పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో అప్పుల పాలయ్యారని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు.

## ఆవిష్కరణలకు దన్నుగా ఏటీఎల్

పెన్ పహాడ్

ఆవిష్కరణలకు దన్నుగా అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) ఉపయోగపడుతుందని కోర్సు డైరెక్టర్ జనార్ధన్ అన్నారు. పిఎంశ్రీ మోడల్ స్కూల్ అనాజిపురం లో మంగళవారం సమగ్ర శిక్ష



తెలంగాణ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన వర్క్ షాపును పాఠశాల ప్రిన్సిపల్ కోడి లింగయ్య అధ్యక్షతన ప్రారంభించారు. ఈ వర్క్ షాప్ కు ముఖ్యఅతిథిగా కోర్సు డైరెక్టర్ జనార్ధన్ విచ్చేసి మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనదని, టెక్నాలజీతో పిల్లలు సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీని కోసం ప్రభుత్వం 10 లక్షల




రూపాయలు వెచ్చించి అటల్ టింకరింగ్ ల్యాబ్ ను సిద్ధం చేసిందని అన్నారు. ల్యాబ్ లో త్రీడీ ప్రింటర్లు రోబోటిక్స్ కిట్ లు, ఎలక్ట్రానిక్స్ కిట్ లు, ఇతర ఆధునిక పరికరాలను అందుబాటులో ఉంటాయని అన్నారు. విద్యార్థులు స్టెమ్ (సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు మ్యాథమెటిక్స్) రంగంలో తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి అదే విధంగా సమస్యల పరిష్కార ఆలోచనలు పెంపొందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. దీనిలో రోజువారి జీవితంలో ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వీటన్నిటిపై ఉపాధ్యాయులకు పూర్తి స్థాయి శిక్షణ నిర్వహించే విధంగా ఈ కార్యశాలను రెండు రోజులపాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ల్యాబ్ మా విద్యార్థులు రోబోటిక్స్, 3%ు% ప్రింటింగ్, మెకానికల్ ,పైతాన్ ప్రోగ్రామింగ్ వాటికి సంబంధించిన ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయుడు కోడి లింగయ్య ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ లు కిరణ్, శంషాద్ అదేవిధంగా జిల్లాలోని తొమ్మిది పాఠశాల నుండి 27 మంది ఉపాధ్యాయులు హాజరైనారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో.... మీ పిల్లల అభివృద్ధికి బాటలు: ఎంఈఓ నకిరేకంటి రవి





పెన్ పహాడ్

ప్రభుత్వ పాఠశాలలు మీ పిల్లల అభివృద్ధికి బాటలు వేస్తాయని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యనందిస్తున్నాయని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బొల్లెద్దు నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు టై, బెల్ట్, ఐడి కార్డ్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కంటే గొప్పగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు టై, బెల్టు , ఐడి కార్డు, షూస్ ధరించడం, ఉపాధ్యాయులు కూడా ఐడి కార్డులు ధరించి పాఠశాలకు హాజరు కావడం మంచి పరిణామం అని అన్నారు. ఇదే పాఠశాలలో పనిచేసి వేరే మండలానికి వెళ్లినా సరే ఈ పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాత పోరెడ్డి హైమావతి కి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు చదువులో ముందంజలో ఉండే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.కె అఖిల్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సరిత, మహేష్ , మండలంలోని వివిధ కాంప్లెక్స్ ల సి ఆర్ పి లు సైదులు, నాగు నాయక్, వహీద్, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జివో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

### ఆదివాసీ గూడాల్లో ఆనందం

### తమ పోరాటం ఫలించందని సంబరం

ఆదిలాబాద్,

ఎక్కడో ఒకచోట పులి జాడలుకనిపిస్తేనే వణికిపోయిన గిరజనం ఇప్పుడు..కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ జోన్ ప్రకటనతో చలించిపోయింది. తాము ఉన్న ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆందోళన చెందారు. అందుకు జీవో 49కి వ్యతిరేకంగా ఉద్యమించారు. జిల్లా బంద్ చేపట్టారు. జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, ఇతర సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీశారు. మిగతా మండలాల్లో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివాసీ, గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నెన్నెలలో జీవో ప్రతులను దహనం చేశారు. కాసిపేట మండలంలో బంద్ నడిచింది. ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు నిర్వహించి దుకాణాలను మూసి వేయించారు. బస్టాండ్, బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గుడిహత్నూర్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు జివోను రద్దు చేసేలా చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న టైగర్ కన్జర్వేషన్ జోన్ విషయంలో సర్కారు వెనక్కి తగ్గింది. సుమారు 330 గ్రామాలను ప్రభావితం చేయనున్న ఈ పులుల సంరక్షణ కేంద్రంపై ఆదివాసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. టైగర్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకువచ్చిన జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జీవో 49 విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ నుంచి సేకరించిన తాజా నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లో లక్షా 49 వేల హెక్టార్లను –టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49ని ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు.

## ఎరువుల కొరత లేదు




అక్షరకలం ప్రతినిధి నల్గొండ

నల్గొండ జిల్లాలో ప్రస్తుతం ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ త్రిపాఠి ఉద్ఘాటించిన జిల్లా కలెక్టర్ త్రిపాఠి ప్రకారం వ్యవసాయేతర అవసరాలకు యూరియాను ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించే దుకాణ యజమానులు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అదనంగా, ఆమె ఎరువుల సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ (18004251442)తో పాటు "ఎరువుల ఫిర్యాదుల కేంద్రం"ని ప్రారంభించారు.

## మద్యం పేరుతో కోట్లు వెనకేసుకుంటున్నారు

### టిడిపి,జనసేన నేతలకు మద్యం దుకాణాల కేటాయింపు

### వైకాపా హయాంలో ఇలాంటి దోపిడీ జరగలేదు: భూమన

తిరుపతి,

మద్యం కుంభకోణం పేరుతో అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం పాల్పడుతొందని వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. చంద్రబాబు మీదా ఏ సెక్షన్ లు అయితే పెట్టారో వాటినే వైసిపి నేతలపై పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మద్యం స్కాం ఎక్కడ బయట పడుతుందనే భయంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం సూమారు 4 వేల మద్యం షాపులను టీడీపీ, జనసేన పార్టీ నేతలకు ఇచ్చారు.. నెలకు రూ. 3 వేల కోట్లను కూటమి ప్రభుత్వ బిగ్ బాస్ లకు మూడుపులు చేరుతున్నాయి.. 14 శాతం కమిషన్ పెంచి షాపుల నుంచి 8 వేల కోట్ల రూపాయలు సేకరించి మూడుపులు రూపంలో ప్రభుత్వ బిగ్ బాస్ కు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి బాటిల్ కు 10 నుంచి 20 రూపాయల వరకు అధికంగా అమ్ముకుంటూ డబ్బుల దాచుకుంటున్నాని భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. అయితే, ఏ మద్యం తాగినా ఆరోగ్యానికి హానికరమే.. ప్రభుత్వం అమ్ముతున్న రూ. 99లకే చీప్ లిక్కర్ బాటిల్ తో తీవ్రమైన అనారోగ్యాలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే భూమన అన్నారు. రాష్ట్రంలో మద్యం ఎరులా పారుతున్న ప్రభుత్వానికి మాత్రం ఆదాయం రాలేదు.. ఆ ఆదాయన్ని బిగ్ బాస్ జేబులో వేసుకుంటున్నారు.. వైసీపీ ప్రభుత్వం హయంలో మద్యం పాలసీతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది.. వైసీపీ హయంలో ఏ ఒక్క తాగుబోతు ప్రజలకు ఇబ్బంది కలిగించలేదు.. కూటమి ప్రభుత్వంలో ఏకంగా తిరుమలలోనే మద్యం తాగుతున్నారుని ఆరోపించారు. వైసీపీ హయంలో మద్యంలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు అని వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడించారు.

## పి-4పై ఎపిలో సర్వేకు సిద్ధం 12 ప్రశ్నలతో వివరాల సేకరణ

అమరావతి,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పి-4 కార్యక్రమంపై ప్రత్యేక సర్వే చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 12 ప్రశ్నలతో సర్వే నిర్వహించడానికి సిద్ధం అవుతుంది. గ్రామ వార్డు, సచివాలయ పరిధిలో సర్వే జరగనుంది. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు.. ఇతర ప్రాంతాల్లో ఎవరున్నారు అనే అంశంపై సర్వే చేయనున్నారు. ఎన్ని ఆస్తులు ఉన్నాయి, ప్రభుత్వం ఇస్తున్న పథకాల వివరాలపై ఆరా తీసే ఛాన్స్ ఉంది. కారు ఉందా, బైక్, టీవీ, ఫ్రిజ్, భూమి ఉన్నాయా అనే ప్రశ్నలు సర్వేలో అడగనున్నారు. అలాగే, ప్రత్యేక యాప్ సహాయంతో ఏపీ సర్కార్ సర్వే చేస్తుంది. భవిష్యత్ లో ఉద్యోగం కావాలా, బ్యాంక్ లోన్ కావాలా లేదా బిజినెస్ పెట్టుకుంటారా అంటూ ఇలా వివిధ ప్రశ్నలపై సర్వే చేయనున్నారు. వ్యవసాయ రుణాలు, ఆదాయ అభివృద్ధి కోసం ఏం కావాలి అనే అంశంపై కూడా ప్రశ్నించనున్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్న ప్రభుత్వం.. ఆగస్ట్ 15వ తేదీ వరకు బంగారు కుటుంబాల వివరాలను ఏపీ ప్రభుత్వం ప్రకటించనుంది.

## త్వరలో ఆడబిడ్డ నిధి పథకం

### ఇచ్చిన హామీ అమలుకు కసరత్తు

### మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి

నంద్యాల ):

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వడివడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకాన్ని కూడా త్వరలోనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆడబిడ్డ నిధి పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకంలో భాగంగా ప్రతి మహిళకు కూటమి ప్రభుత్వం నెలకు రూ.15000 అందించనుంది. ఈ పథకం ప్రకారం 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న వారికి బ్యాంకు ఖాతాలో రూ.15000 జమ చేయనున్నారు. ఈ పథకంపై మంత్రి ఆనంరామనారాయణ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఆడబిడ్డ నిధిని కూడా త్వరలో ప్రారంభిస్తామని ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆడబిడ్డలకు పెళ్లి, ఉద్యోగం వచ్చే వరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధితో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చెప్పిన మాట చేసి చూపించే వ్యక్తి చంద్రబాబునాయుడు అని అభివర్ణించంచారు. మంగళవారం నంద్యాల జిల్లాలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను చాలామంది అవహేళన చేశారని... కాని ప్రజలు విశ్వసించారు, గెలిపించారని అన్నారు. దుర్వేసి గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామంలో సుంకులమ్మ గుడిని నిర్మిస్తామని మాటిచ్చారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఏపీలో ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు పూజారికి ప్రతినెల రూ.10 వేలు ఇవ్వనున్నామని ప్రకటించారు.

# మానవ అక్రమ రవాణా చేస్తూ వారితో వెట్టి చాకిరి చేయిస్తే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా యస్.పి శరత్ చంద్ర పవర్

అక్షరకలం ప్రతినిధి నల్గొండ

గత కొంత కాలంగా కృష్ణ నది పరివాహక ప్రాంతంలో కొందరు చేపల వ్యాపారం చేసే వ్యక్తులు అక్రమంగా ఇతర రాష్ట్రాల నుండి అనగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిషా రాష్ట్రాల నుండి వ్యక్తులను రవాణా చేసుకొని వారితో వెట్టి చాకిరి చేయించుకుని ఎలాంటి జీతాలు ఇవ్వకుండా వాళ్లను భయానికి గురి చేస్తూ పని సమయ వేళలు పాటించకుండా ఆదిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వారితో చేపలు పట్టిస్తూ వెట్టి చాకిరి చేపించుకుంటున్న వ్యక్తుల చెరనుండి , దేవరకొండ







సబ్ డివిజన్ పరిధి లో 32 కార్మికులు, 4గురు బాలకార్మికులు, మొత్తం 36 మంది వెట్టిచాకిరి బాధితులను జిల్లా పోలీసు,రెవెన్యూ,చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఇతర అధికారులు సమన్వయంతో బృందాలుగా ఏర్పడి నది పరిపాక ప్రాంతంలోని వ్యక్తులను గుర్తించి రెస్క్యూ చేసి వెట్టి చాకిరి చేయించుకుంటున్న నిందితులను అరెస్ట్ చేయడం జరిగినది.

నిందితుల వివరాలు .

1) వడ్త్య జవాహర్ లాల్ తండ్రి రాములు, వయస్సు: 50 సం.లు, నివాసం : బనాలకుంట గ్రామం. పి.ఏ పల్లి మండల్ నల్గొండ జిల్లా.

2) రామవత్ రమేష్ తండ్రి లక్పతి , వయస్సు: 24 సం.లు,నివాసం : పాయ తండా గ్రామం. పి.ఏ పల్లి మండల్ నల్గొండ జిల్లా.






3) మైలపల్లి శివ తండ్రి దేవుడు, వయస్సు: 30 సం.లు, నివాసం : %ఎ.చీశీ%. 4-45 వాడపాలెం గ్రామం, రాంబిల్లి మండల్, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

4) కారే సింహా చలం తండ్రి: సింహా చలం, వయస్సు: 39 సం.లు,నివాసం : బంగారమ్మపాలెం గ్రామం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

5) వంక విశాఖ ఏ ఇషాక్ తండ్రి: మహంకాల్, వయస్సు: 26 సం.లు, నివాసం : అమలాపురం గ్రామం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్

6) ఎరిపల్లి బాబుజీ ఏ బావొజి తండ్రి: బంగారి, వయస్సు: 45 సం.లు, నివాసం : వైజాగ్ కాలనీ గ్రామం, నేరేడుగొమ్ము, నల్గొండ జిల్లా.

7) చాపల తాత రావు తండ్రి: సోమరాజు, వయస్సు: 38 సం.లు, నివాసం : వైజాగ్ కాలనీ గ్రామం, నేరేడుగొమ్ము, నల్గొండ జిల్లా, తెలంగాణ

8) చాపల బంగారి తండ్రి: బంగారి వయస్సు: 39 సం.లు, నివాసం : వైజాగ్ కాలనీ గ్రామం, నేరేడుగొమ్ము, నల్గొండ జిల్లా.


కేసు వివరాలు

పైన తెలిపిన నిందితులలో గుడిపల్లికి చెందిన జబ్బార్ ఏ జవహర్ లాల్, రమేశ్ మరియు శివలు వీరి ఏజెంట్లు అయిన రాజు,(హైద్రాబాద్) జగన్, (హైద్రాబాద్) లోకేశ్ (విజయవాడ)లకు ఒక వ్యక్తి కి 1500 చొప్పున కమిషన్ ఇచ్చి హైద్రాబాద్ విజయవాడ నుంచి వలస కార్మికులను నెలకు 15 వేల జీతం, రోజుకి 2 గంటల పని, ఉచిత ఆహారం మరియు మద్యం సరఫరా చేస్తాం అని మబ్బ పెట్టి వారిని అక్కడ నుంచి దేవరకొండ లోని మల్లేపల్లి వరకు పంపుతారు.అక్కడ నుంచి నిందితులు వారి సెల్ ఫోన్ తమ అదినంలో పెట్టుకొని వారిని రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాల పైన నేరేడు గుమ్ము పోలీస్ స్టేషన్ పరిధిలోని బాణాలకుంట,వైజాగ్ కాలనీ కి తరలించి వారితో అక్కడ తెల్లవారు జామునా నదిలోకి చేపలు పట్టుటకు పంపేవారు.అలాగే చేపల వలలు లాగుటకు ఉపయోగించుకునేవారు.వీరికి రోజుకు రెండు పూటలా మాత్రమే ఆహారం అందిచేవారు.వీరికి పని బారం ఎక్కువ అయితుంది మేము చేసిన పనికి డబ్బులు ఇవ్వవలసిందిగా కోరగా డబ్బులు ఇవ్వకుండా వీరిని హింసిస్తూ వాతలు పెట్టేవారు.ఇదే విదంగా నిందితులు అయిన ఇషాక్ మరియు సింహాచలం వారి ఏజెంట్ అయిన వెంకన్న (విజయవాడ) (5000 ఒక్కరికీ కమిషన్) కలిసి ఇలాంటి కార్యక్రమాలు చేసేవారు. పైన తెలిపిన ఏజెంట్లు అయిన రాజు,జగన్,లోకేశ్,వెంకన్నలు కొరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది త్వరలో అదుపులోకి తీసుకొనీ పూర్తి వివరాలు తెలపడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా యస్.పి గారు మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తులను అక్రమ రవాణా చేసి వారిని బెదిరించి లేదా గాయపరిచి వారితో ఎలాంటి వేతనాలు ఇవ్వకుండా సమయవేళలు పాటించకుండా పనులు చేయించిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ గారు హెచ్చరించారు. ఎవరైనా బాల బాలికలను పనిలో పెట్టుకున్న చిన్న పిల్లలతో వెట్టి చాకిరీ చేయించుకున్న హెల్ప్ లైన్ నంబర్1098, 181, చైల్డ్ కేర్ వారికి సమాచారం ఇవ్వాలి అని ఎస్పీ గారు కోరినారు. ఇట్టి ఆపరేషన్ ను దేవరకొండ ఎ ఎస్పి మౌనిక గారి పర్యవేక్షణలో డిండి, కొండమల్లేపల్లి సిఐ లు మరియు గుడిపల్లి, నేరేడు గుమ్ము , గుర్రంపోడ్ ఎస్సై గార్లు రెవెన్యూ, చైల్డ్ కేర్,%ఎష్ట్రఅశ్రీస% లైన్ ,%జఔజ% బృందం మరియు నేరేడుగొమ్ము పోలీసు స్టేషన్ సిబ్బంది పి.మహేశ్, ఆర్.రాజు, వి.పి.ఓ ప్రశాంత్, వై.నరేందర్ రెడ్డి తదితరులు జిల్లా ఎస్పీ గారు అభినందించడం జరిగింది.

# టీమిండియాకి మరో ఫ్రంట్ లైన్ బౌలర్ అవసరం

### భారత వెటరన్ క్రికెటర్ రహానే వ్యాఖ్య

ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో భారత్ ప్రస్తుతం వెనుకంజలో ఉన్న సంగతి తెలిసిందే. ఐదు మ్యాచ్ ల ఈ సిరీస్ లో ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. అయితే ఈనెల 23 నుంచి మాంచెస్టర్ లో జరిగే నాలుగో టెస్టులో విజయం సాధించాలంటే టీమిండియాలో కచ్చితంగా ఒక బిగ్ మార్పు జరగాల్సిందేనని వెటరన్ భారత క్రికెటర్ అజింక్య రహానే వ్యాఖ్యానించాడు. ముఖ్యంగా బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని పేర్కొన్నాడు. మూడో టెస్టులో ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లను పెట్టుకుని 193 పరుగుల టార్గెట్ ను ఛేదించలేక టీమిండియా చతికిలపడింది. ముఖ్యంగా ముగ్గురు ఆల్ రౌండర్లతో ఆడటంతో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లోనూ అంతగా సత్తా చాట లేక పోయింది. అందుచేత బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేసినట్లయితే బాగుంటుందని పేర్కొన్నాడు. భారత ప్లేయింగ్ లెవన్ లో కీలక మార్పు చేయాలని రహానే సూచించాడు. ముఖ్యంగా ఫ్రంట్ లైన్ బౌలర్ ను మరొకరిని ఆడించాలని పేర్కొన్నాడు. బ్యాటింగ్ లో విఫలమవుతున్న నితీశ్ రెడ్డి స్థానంలో ఏస్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ను ఆడించాలని సూచించాడు. ఇంగ్లాండ్ లో 20 వికెట్లను త్వరగా తీయగలిగితేనే విజయం సాధించే అవకాశముందని, మూడో టెస్టులో కేవలం ముగ్గురు మాత్రమే ఫ్రంట్లైన్ బౌలర్లు జస్ ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ లతో మాత్రమే ఆడింది. నితీశ్ తోపాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ లను ఆడించింది. అయితే వీరు ముగ్గురు బ్యాటింగ్ ఆల్ రౌండర్లే కావడం విశేషం.భారత హెడ్ కోచ్ గౌతం గంభీర్ కు ఆల్ రౌండర్లపై మక్కువ ఎక్కువ. అందుకే జట్టులో ముగ్గురు ఆల్ రౌండర్లు ఉన్నారని తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురిలో నితీశ్ బౌలింగ్ లో ఫర్వాలేదనిపిస్తుండగా, బ్యాటింగ్ లో తేలిపోయాడు. అటు జడేజా బ్యాటింగ్ లో ఆకట్టుకుంటున్నప్పటికీ, బౌలింగ్ లో అంతగా రాణించడం లేదు. ఇక సుందర్.. మాత్రం రెండు విభాగాల్లో ఉనికి చాటుకున్నాడు. దీంతో నాలుగో టెస్టులో టీమిండియా కూర్పుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ క్రమంలో పలువురు మాజీలు పలు రకాలుగా సలహాలు ఇస్తున్నారు. ఇక రెండో టెస్టులో ఓడిన ఇంగ్లాండ్ అద్భుతంగా పుంజుకుని, విజయం సాధించిందని రహానే ప్రశంసించాడు. ముఖ్యంగా జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ వంద శాతం ఎఫర్ట్స్ అన్ని విబాగాల్లో, మ్యాచ్ అంతటా కొనసాగించాడని పేర్కొన్నాడు. ముఖ్యంగా రిషభ్ పంత్ రనౌట్ విషయం ఈ విషయాన్ని నిరూపిస్తుందని పేర్కొన్నాడు. ఇక నాలుగో టెస్టులో గెలిచి, సిరీస్ నెగ్గాలని ఇంగ్లాండ్ సమరోత్సాహంతో ఉంది. మరోవైపు ఈ మ్యాచ్ లో ఇరుజట్లు తప్పనిసరిగా పలు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది. స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయపడటంతో అతని స్తానంలో మరో ఆటగాడిని ఇంగ్లాండ్ ఆడించబోతోంది. ఇక భారత్ కూడా మరో ఎగస్ట్రాబౌలర్ తో ఆడే అవకాశముంది. అలాగే వరుసగా విఫలం అవుతున్న కరుణ్ నాయర్ పై కూడా వేటు పడవచ్చు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955